హనీబీఎపి

మార్చి - ఏప్రిల్ 2015

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org

సంపుటి 3, సంచిక 5




## హస్తినలో వెలిగిన తెలుగు ఇన్నోవేటర్ల ప్రతిభ



# ఎవరు బ్రతకడం ప్రధానం?




గుజరాత్‌లోని సుర్పురా గ్రామంలో నివసించే 'జీవభా' అనే రైతు ఆశగా ఆకాశం వంక చూస్తున్నాడు. అతని పొలం ఎండిపోతోంది. మొలిచిన మొలకలు వాడిపోతున్నాయి. వర్షమా రావటం లేదు.

ఒక నెలక్రితం వడగళ్ళతో పెద్ద వర్షం పడింది. రైతులు హమ్మయ్య అనుకుని ఊపిరి పీల్చుకున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి సరియైన వానలు లేక కరువు తాండవిస్తోంది మరి. వాళ్ళదగ్గరున్నదంతా ఖర్చు చేసి విత్తనాలు కొన్నారు. కొందరు అప్పు తెచ్చి మరీ కొన్నారు. విత్తనాలు నాటాక ఒక్క మబ్బుతునకా కనిపించడం లేదు. సుర్పురా గ్రామంలో ఎక్కువమంది గొర్రెల కాపరులున్నారు ఆ గొర్రెలు ఎండు గడ్డితో సహా పొలాల్లో వున్న గడ్డినంతా తినేశాయి. జీవభా సృశ్కించిన తన రెండు ఎడ్లని, వాటి కష్టాన్ని చూసి బాధపడ్డాడు. వాటి ఆకలి అరుపులు వినలేక తమ కుటుంబానికి అదే జీవనాధారమని తెలిసి కూడా వాటిని తన సజ్జల పంటలోకి వదిలేశాడు.

అతని భార్య ఇదిచూసి, గేదెలను అదిలించటానికి పరిగెత్తుకు వచ్చింది. జీవభా ఆమెని వారించి, వాటినేమీ అనకు, అవి రెండు రోజులనుంచి ఏమీ తినలేదు, ఆకలిమీదున్నాయి, వాటికి పెట్టడానికి ఇంట్లో కూడా ఏమీ లేదు, అవి మనకోసం ఎంతో కష్టించి పనిచేస్తాయి, వాటి ఆకలిని మనం కాకపోతే ఎవరు తీరుస్తారు? అందుకే నేనే వాటిని పొలంలోకి వదిలాను. అవి బ్రతికితే, అదృష్టంకొద్దీ వానలు వస్తే మనకి తగినన్ని గింజలు లభించకపోవు అన్నాడు.

జీవభా భార్యకు పశువులపై వచ్చిన కోపం కాస్తా జాలిగా మారిందా? మనకు తెలియదు. మనకసలు తర్వాత అక్కడ వర్షాలు పడ్డాయో లేదో కూడా తెలియదు. కానీ, ఎవరి అవసరాలు ముందు? బలహీనమైన మూగ జీవాలదా? లేక బలవంతులమైన మనలాంటి వారిదా? జీవభా భార్య తన కుటుంబం ఆకలిని తర్వాత ఎలా తీర్చిందో కూడా మనకు తెలియదు.

'గుజరాత్ సమాచార్' పత్రికలో 'దౌలత్‌భట్' వ్రాసిన 'ధర్తీ నో దబ్‌కార్' అనే వ్యాసంలోంచి సేకరించబడింది.

**– హనీబీ – 8(3) 1997**

Vol-3, Issue - 5 PALLE SRUJANA March-April 2015

NIF టోల్ ఫ్రీ నెంబర్
1800 233 5555

# పల్లెసృజన

సంపుటి-3 సంచిక - 5

మార్చి-ఏప్రిల్ 2015

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్మలమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్మలమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్

## ఈ సంచికలో...


- ఇన్నోవేషన్ల పండుగ - 2015 - 3
- ఒకేసారి మూడు పనులు చేసే డ్రమ్‌సీడర్ - 5
- పల్లెసృజన వేదికగా జ్ఞాన వ్యాప్తి - 8
- రైతుకు కావలసిన స్ప్రేయర్ తయారు చేసిన పల్లె ఇన్నోవేటర్ - 10
- బేకరీ పదార్థాలు తయారు చేసేందుకు స్టౌపైన పెట్టుకొనే చిన్న ఓవెన్ - 13
- ఇగ్నైట్-14 విజేతలు - 18
- 14వ చిన్నశోధయాత్ర - 23
- జ్ఞానయజ్ఞం - 31
- స్పందన - 32


---

కవర్ లోపలి పేజీల్లో ....
హనీబీ కథ
"ఇన్నోవేషన్ల పండుగ" ఫొటోలు

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.
ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
editor@pallesrujana.org
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
040- 40029002
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# ప్రజల జ్ఞానాన్ని విస్తరింపజేయడం ఎలా!

గత పదేళ్ళుగా 'పల్లెసృజన' సంస్థ తెలుగు రాష్ట్రాల్లో స్వచ్ఛంద కార్యకర్తల సహాయంతో గ్రామీణ శాస్త్రవేత్తలను వెతుకుతూ వారిని వెలుగులోకి తీసుకు రావడానికి అవిశ్రాంతంగా శ్రమిస్తున్నది. ఇప్పటికే వివిధ గ్రామాల నుండి నూటయాభై మందికి పైగా ఇన్నోవేటర్లను వెలుగులోకి తెచ్చి వారికి గుర్తింపునందించింది. 12 జాతీయ అవార్డులు రాష్ట్రపతి ద్వారా మన తెలుగు ఇన్నోవేటర్లకు లభించటానికి కారణభూతమైంది. ఎన్నో స్థానిక గుర్తింపులు, సత్కారాలు, కాలేజీ, స్కూలు విద్యార్థులతో చర్చలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వాధికారులతో సంధానాలు, మీడియాపరంగా పరిచయాలు.... ఇలా ఎన్నో 'పల్లెసృజన' సాధించినా, సాధించాల్సింది ఇంకా ఎంతో వుంది.

'పల్లెసృజన' స్వచ్ఛంద సంస్థగా పూర్తిగా వాలంటీర్లపైనే ఆధారపడి ఉంటుంది. ఈ పత్రిక కూడా వాలంటీర్ల సహాయంతోనే నడుపుతున్నాం. గత పది సంవత్సరాలుగా పల్లెసృజన కార్యక్రమాల్లో పాల్గొనే వాలంటీర్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇంకా వేలమంది ముందుకు రావాలి. స్థానిక జ్ఞానాన్ని వెతకాలి, వెలికి తీయాలి, వెలుగులోకి తేవాలి. స్థానిక జ్ఞానం, స్థానిక పరిష్కారాలు, మనుష్యులను, ప్రకృతిని కాపాడుతాయి. జ్ఞాన ఆధారిత సమాజానికి బలం చేకూరుస్తాయి. గ్రామీణ పరిష్కారాలన్నీ ఆధునిక సైన్సులోని టెక్నాలజీ ఆధారిత పరిష్కారాల్లా ఉండవు. వీటిలో టెక్నాలజీ ఒక భాగం మాత్రమే. జీవజాతి, ప్రకృతి, సుస్థిరత ప్రధానంగా ఉండే ఈ గ్రామీణ జ్ఞానాన్ని విద్యార్థులకు, యువకులకు పరిచయం చేయాలి. వారు దీన్ని కూలంకషంగా అధ్యయనం చేసి దేశాభివృద్ధికై ఉపయోగించాలి.

పల్లెసృజన సేకరించిన ఇన్నోవేషన్లు చాల ఉపయోగకరంగా అందుబాటు ధరలో ఉంటాయి. సరళమైన టెక్నాలజీతో వాడటంలో కాని, మెయింటెయిన్ చేయటంలో కాని క్లిష్టమైన పద్ధతులు లేకుండా సులభంగా ఉంటాయి. తయారు చేయడం కూడా చాలా సులభం. భారీ మెషినరీ కాని, వినూత్న ఇంజనీరింగ్ పద్ధతులు కాని, ప్రత్యేక ముడిసరుకులు కాని అవసరం లేకుండా, స్థానికంగా లభించే సామాగ్రితోనే వీటిని తయారు చేయవచ్చు. ఇన్ని సౌలభ్యాలున్న ఈ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు అందరికీ చేరటం లేదన్న విషయం పల్లెసృజనకు భారంగా, బాధగా వుంది. పల్లెసృజన ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నది కాని, అందరికీ చేరటం లేదన్న లోటు కనిపిస్తోంది. ఈ పల్లెజ్ఞానం గురించి అందరికీ తెలియాలి, అందరూ దీని సుగుణాలను గురించి అవగాహన చేసుకుని వారు వాడుతూ, ఇతరులకూ వ్యాప్తి చేయాలి. పారిశ్రామికవేత్తలు వీటి ప్రాముఖ్యతని అర్థం చేసుకుని ఉత్పత్తి చేసి, మార్కెట్లోకి తేవడానికి ముందుకు రావాలి. ప్రభుత్వం, ప్రజలు, సామాజిక సంస్థలు కూడా ప్రోత్సహించాలి.

పల్లెసృజన వెతికి వెలికితీసిన "రైతులకై రైతుల పరిష్కారాలు, ప్రయోగాలు" విస్తారంగా అందరికీ చేరవేయాలన్నది మా యజ్ఞం. ఈ యజ్ఞాన్ని ఎలా విజయవంతం చేయాలో పాఠకులు సలహాలిచ్చి, మాకు మార్గదర్శకత్వం చేయవలసిందిగా కోరుతున్నాం.

మార్చి 7-13 తేదీల్లో న్యూఢిల్లీ లోని రాష్ట్రపతి భవనంలో జరిగిన 'ఇన్నోవేషన్ల పండగ'లో పాల్గొనటానికి నలుగురు తెలుగు ఇన్నోవేటర్లకు అవకాశం వచ్చింది. వారి ఇన్నోవేషన్లకు ఎంతో ఆదరణా లభించింది. అంతేకాకుండా ఇద్దరు ఇన్నోవేటర్లకు రాష్ట్రపతి పురస్కారం, ఇద్దరు సమాజ సేవకులకు 'సృష్టి సమ్మాన్' పురస్కారం లభించాయని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాం. వివరాలు ఈ సంచికలో ప్రచురించాం. పాఠకులు మా ఆనందాన్ని పంచుకుని తెలుగువారికి మరిన్ని జాతీయ గుర్తింపులు, సత్కారాలు లభించడానికి సహకరిస్తారని ఆశిస్తున్నాం.

దేశ స్థాయిలో **"ఇన్నోవేషన్ల పండగ"** ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో ఏడు రోజులపాటు జరిగిన సమావేశాల్లో పునాదిస్థాయి ఇన్నోవేషన్లు, చిన్నారుల జ్ఞాన పిపాస, యువకుల ఉత్సాహభరిత ప్రయోగాలను గురించి చర్చలు జరిగాయి. "మేక్ ఇన్ ఇండియా" ఉద్యమం సార్థకం కావాలంటే కేవలం సైంటిస్టులపై ఆధారపడకుండా, గ్రామీణ స్థానిక జ్ఞానం, యువకులు, ఇన్నోవేటర్లపై దృష్టి సారించాలని, వీటిని సరిగా ఉపయోగించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం, బ్యాంకులు, మేధావులు సీరియస్‌గా కార్యప్రణాళిక తయారు చేయాలని నిర్ణయించారు. కొంత ఆలస్యం జరిగినా, ఇప్పటికైనా దేశానికి హితం చేసే నిర్ణయాలు తీసుకున్నందుకు పల్లెసృజన ఆనందం వ్యక్తం చేస్తున్నది.

'మన్మథనామ' సంవత్సరంలో పల్లెజ్ఞానం విస్తృతంగా వ్యాప్తి చెందాలని కోరుకుంటూ.....

ఉగాది శుభాకాంక్షలతో.....



భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

### కొత్త ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో
# ఇన్నోవేషన్ల పండుగ - 2015




ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రతి సంవత్సరం మార్చి 7 నుండి 13వ తేది వరకు "ఇన్నోవేషన్ల పండుగ" (ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్స్) జరుగుతుంది. అలాగే ఈ సంవత్సరం కూడా జరపబడింది.

ఇందుకుగాను 'పల్లెసృజన' గత 7-8 నెలలుగా శ్రమించి మొత్తంమీద ఈ క్రింది నాలుగు ఎంట్రీలను సంపాదించింది. అవి .......

1. గుంటూరు జిల్లా, ధరణికోట, అమరావతికి చెందిన **కె. చంద్రశేఖర్** తయారు చేసిన **"ఇటుకల తయారీ సాధనం"**.
2. వరంగల్ జిల్లా పరకాల గ్రామానికి చెందిన **కడివెండి మహిపాల్‌చారి** తయారు చేసిన **"కలుపు తీసే యంత్రం"**.
3. గుంటూరు జిల్లా, వీరన్న పాలెం గ్రామానికి చెందిన **మువ్వా క్రిష్ణమూర్తి** గారి **"వరిగడ్డితో చీర, కండువా, ఇతర సామాగ్రి తయారీ"**.
4. "స్వచ్ఛభారత్"కు సరియైన నిర్వచనంగా నల్గొండ జిల్లా, ముక్తాపూర్ గ్రామవాసి **గోదాసు నర్శింహ** తయారు చేసిన **"గుర్రపు డెక్కను తీసే యంత్రం"**.

ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి మేమందరం అనగా బ్రిగేడియర్ పోగుల గణేశం, జాగర్లమూడి దుర్గాప్రసాద్, నేను మార్చి 6వ తేది నాటికి ఢిల్లీ చేరుకున్నాము. మా అందరికీ వివిధ హొటళ్లలో వసతి ఏర్పాటు చేశారు. చంద్రశేఖర్, మహిపాల్ చారి, నరసింహ, కృష్ణమూర్తిలతో పాటు పల్లెసృజన వాలంటీర్ సుభాష్‌లు ఒకరోజు ముందుగానే అక్కడికి చేరుకుని ఇన్నోవేషన్లను బిగించుకుని 6వ తారీఖునే అంతా సిద్ధం చేసి వుంచారు.

7వ తేదీన రాష్ట్రపతి భవన్ శోభాయమానంగా ముస్తాబైంది. ప్రక్కనేవున్న కల్చరల్ సెంటర్‌లో రంగరంగ వైభవంగా రాష్ట్రపతిని ఆహ్వానించటానికి వేదిక నిర్మించారు. శ్రీ మషేల్కర్ గారు, అనిల్‌గుప్తా గారు, ఇతర ఎన్.ఐ.ఎఫ్. సిబ్బంది ఉదయం నుండే అన్ని కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించి చూసుకున్నారు. ఇందులో మన తెలుగు వారైన చంద్రశేఖర్ గారు జాతీయ స్థాయిలో 3వ బహుమతి, లక్ష రూపాయల పారితోషికం రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నాడు. ఆరోజును మన ఇన్నోవేటర్ చంద్రశేఖర్ తన జీవితంలోనే మరువలేని రోజు అనటంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. ఒక సామాన్యుడు రాష్ట్రపతి భవనంలోకి అడుగు పెట్టాలంటేనే అసాధ్యం. అలాంటిది రాష్ట్రపతి చేతులమీదుగా ఒక సామాన్యుడైన చంద్రశేఖర్ పురస్కారం అందుకోవటం మరి సామాన్యమా? చంద్రశేఖర్ గారిని వెలుగులోకి తీసుకు రావటంలో పల్లెసృజన, ప్రత్యేకంగా బ్రిగేడియర్ గణేశం గారి కృషి అనిర్వచనీయం.

తరువాత రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్స్"ని సందర్శించారు. ప్రతి స్థాయిలో ఆగి, అడిగి మరీ తెలుసుకున్నారు. శభాష్ అని ప్రశంసించారు.

ఇక్కడో ముఖ్యమైన విషయం మనం చెప్పుకోవాలి. ముప్పా క్రిష్ణమూర్తి గారు రాష్ట్రపతికి తాను వరిగడ్డితో తయారు చేసిన కండువాను బహూకరించారు. అది అతను కోరుకున్న కోరిక. ఇది తీర్చడంలో బ్రిగేడియర్ గణేశం గారి కృషి ఎంతోవుంది. ఒక గ్రామీణ ఇన్నోవేటర్‌కి ఇలాంటి అవకాశం చెప్పలేనంత సంతృప్తినిస్తుంది. తరువాత రాష్ట్రస్థాయి విజేతలకు శ్రీ మషేల్కర్ గారు పురస్కారాలను అందజేశారు. ఈ విభాగంలో మన కడివెండి మహిపాల్ చారి, అతని సతీమణి లావణ్య హాజరయ్యారు, మహిపాల్ పురస్కారం తీసుకున్నాడు. తెలుగు ఇన్నోవేషన్లను గురించి ప్రజాదరణ పొందే రీతిలో వ్రాసి, తెలుగు ప్రజలకు వాటిగురించి తెలిసేలా కృషి చేసిన 'సాక్షి' దినపత్రిక ఉప సంపాదకుడు శ్రీ పంతంగి రాంబాబు గారికి పాత్రికేయ రంగంలో రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది.

ఆ మరునాడు, అనగా మార్చి 8న 'సృష్టి సమ్మాన్' విజేతలకు అదే హాలులో పురస్కారాలు ఇచ్చారు. ఈ వర్గంలో 'పల్లెసృజన' ప్రతిపాదించిన ఇద్దరికి పురస్కారం లభించింది. మొదటిది శ్రీ దరిపల్లి రామయ్య గారికి. ఖమ్మం జిల్లా వాస్తవ్యుడైన రామయ్య తన చిన్నతనం నుండే చెట్లని నాటడం, వాటిని పెంచడమే ధ్యేయంగా ఎవరి సహాయ, సహకారాలు ఆశించకుండా తాను తలపెట్టిన మహత్తర కార్యం నిర్వహిస్తున్నాడు. రామయ్య ఇప్పటికే కోటికి పైగా వృక్షాలను పెంచివుంటాడు. తనకు తిండికి లేకపోయినా తనకున్న దాంట్లోంచి వెచ్చించి, చెట్లను పెంచి, ఖాళీగా వున్న ప్రతిచోటా నాటాడు. అతను పెంచిన మొక్కలు ఇప్పుడు ఎత్తైన వృక్షాలైనందుకు సంతోషించే వ్యక్తి రామయ్య. ఇంతటి సమాజ, పర్యావరణ స్ఫూర్తితో రామయ్య చేసిన ఈ మహత్కార్యాన్ని 'ప్రకృతినేస్తం' అనే పత్రికలో శ్రీ క్రాంతి




వ్రాసిన వ్యాసానికి స్పందించి, 'పల్లెసృజన' దానిని అనువదించి, "సృష్టి" సంస్థకు పంపింది. ఇదే మనం చేసిన ఉడతా భక్తి సేవ. రామయ్యని శ్రీ మషేల్కర్ గారు, శ్రీ అనిల్ గుప్తా గారు శాలువాతో సత్కరించారు.

అలాగే మహబూబ్‌నగర్ జిల్లాకి చెందిన శ్రీమతి దామా యాదేశ్వరి అంధులు చదువుకునే విధంగా బ్రెయిలీ లిపిలో 500కు పైగా పుస్తకాలను అనువదించింది. అందులో రామాయణ, మహాభారత, భాగవత కథలు కూడా ఉన్నాయి. చిన్న వయసులో ఆమె చేసిన ఈ సేవను చూసి 'పల్లెసృజన' ఆమె కథను కూడా "సృష్టి" సంస్థకు పంపించింది. యాదేశ్వరి గారికి శ్రీ మషేల్కర్ గారు 'సృష్టి సమ్మాన్'తో సత్కరించారు. పురస్కారాల కార్యక్రమం ఇంతటితో ముగిసింది.

7-13 మార్చి వరకు రోజూ ఎందరో పెద్దలు, నిష్ణాతులు, పాత్రికేయులు ఈ ప్రదర్శనని సందర్శించారు. బంగ్లాదేశ్ నుండి వచ్చిన నోబెల్ బహుమతి గ్రహీత శ్రీ మహమ్మద్ యూనుస్ గారు కూడా మన తెలుగు వారి ఇన్నోవేషన్లను చూసి అభినందించారు. మనవరకు ప్రముఖంగా చెప్పుకోదగ్గ పెద్దలు కేంద్రమంత్రి వర్యులు శ్రీ వెంకయ్య నాయుడు, శ్రీ సుజనా చౌదరి, పార్లమెంటు సభ్యులు శ్రీ వినోద్, శ్రీ సుమన్, శ్రీ మధుసూధనా చారి, మన తెలుగు వారి ఇన్నోవేషన్లని చూసి వారిని ప్రశంసించారు. శ్రీ వెంకయ్య నాయుడు "స్వచ్ఛభారత్" ఉద్యమంలో భాగంగా విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న సభకు గోదాసు నర్సింహను ప్రత్యేకంగా ఆహ్వానించి, పలువురు పెద్దల ముందు నరసింహను పరిచయం చేశాడు. ఒక అట్టడుగు ఆవిష్కర్తను విద్యాధికుల మధ్యకు పిలిపించి, గౌరవించడం నర్సింహకు ఒక అమోఘమైన అనుభవం, తెలుగు ప్రజలకు గర్వకారణం.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో వుంది. ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పుకోక తప్పదు. ఎక్కడో గ్రామంలో ఏమాత్రం ఆర్భాటం లేకుండా తన సమస్యలకు, సమాజ సమస్యలకు సమాధానం వెతికిన ఆవిష్కర్తకు ఇది ఊహకు అందని ఆనందం. రాబోయే రోజుల్లో మనం ప్రతి సంవత్సరం కనీసం పదిమంది ఆవిష్కర్తలను గుర్తించి, ఈ ప్రదర్శనలో చోటుకోసం శ్రమించాలని మనసా ● కోరుకుంటున్నాను.

# ఒకేసారి మూడు పనులు చేసే డ్రమ్‌సీడర్

## దమరసింగి బాబూరావ్ ఆవిష్కరణ




ఆంధ్రప్రదేశ్‌లో విజయనగరం జిల్లా పార్వతీపురం గ్రామవాసి "దామరశింగి బాబూరావ్" తన గ్రామంలో ఒక చిన్నపాటి వెల్డింగ్ షాపు నిర్వహించుకుంటూ ఉన్నాడు. మొదట్లో తన పెదనాన్న గారివద్ద వెల్డింగ్ షాపులో పని నేర్చుకున్న తర్వాత తానే స్వయంగా ఓ వెల్డింగ్ షాప్‌ను ఏర్పాటు చేసుకుని తనదైన ఆలోచనలతో రైతులకు అవసరమైన పనిముట్లను తయారు చేయటంతో తన ప్రత్యేకత చాటుకున్నాడు. ఈ క్రమంలోనే తనకు కూడా కొంత పొలం వుంటే బావుంటుందని భావించి 10 సంవత్సరాల క్రితం కొంత పొలం కూడా కొన్నాడు. అప్పటివరకు రైతుల సాధక బాధకాలు విన్న బాబూరావు ఇప్పుడు వాటిని అనుభవించటంతో తాను చేస్తున్న పనులకు ఇంకా మెరుగులు దిద్దే అవకాశం వచ్చింది. భార్య కళావతి ఇంట్లో పనులు, పొలం పనులను చూసుకుంటూనే బాబూరావుకు చేదోడు వాదోడుగా వుండి ఈయన చేసే పనులకు ప్రోత్సాహమిస్తూ వుంటుంది. ఇతనికి గుణశేఖర్, రాజశేఖర్ అనే ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరు అబ్బాయిలను మంచి చదువులు చదివిస్తున్నాడు. పెద్దవాడు గుణశేఖర్ ఇంటర్మీడియట్‌లో 90 శాతం మార్కులతో పాసై ప్రస్తుతం ఇంజనీరింగ్ చదువుతుండగా, రెండవ వాడు రాజశేఖర్ 10వ తరగతి చదువుతున్నాడు.


ప్రస్తుతం రైతులపై కూలీల భారం, ట్రాక్టర్లతో వ్యవసాయం చేయించేందుకు కిరాయి భారంతో ఎంతో కృంగిపోతున్నాడని భావించి తనవంతుగా ఏవైనా పరికరాలు చేస్తే బావుంటుందని ఆలోచిస్తుండగా, ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న డ్రమ్‌సీడర్ అతని దృష్టిని ఆకర్షించింది. సరే దీన్ని ఇంకా అభివృద్ధి చేస్తే బావుంటుందని ఆలోచించాడు. డ్రమ్‌సీడర్ కేవలం విత్తనాలను మాత్రమే వేస్తుంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు విత్తనాలు వేసిన వెంటనే కలుపు మందులు పొలంలో పిచికారి చేయటం పరిపాటుగా

మారిపోయింది. ఎందుకంటే ఆ తర్వాత గడ్డి ఎక్కువగా మొలిస్తే వాటిని తీయించుకునేందుకు కూలీలు లభించడం కష్టమవుతుంది. ఒకవేళ లభించినా ఆ కూలీ ఖర్చు తడిసి మోపెడవుతున్న కారణంగా విత్తిన వెంటనే 'కలుపు మందు' పిచికారి చేయటం తప్పనిసరిగా మారింది. అలాగే విత్తనం వేసిన తర్వాత రైతులు చేసే మరో పని వేసిన విత్తనంపై మట్టి మూసుకు పోయేలా చేయటం (గుంటక సహాయంతో).

వీటన్నిటిని గమనించిన బాబూరావు ఈ మూడు పనులను ఒకసారి చేస్తే ఎంతో బావుంటుందికదా అని ఆలోచించాడు. అయితే ఈ సాధనాన్ని ఎక్కువ ఖరీదులో కాకుండా, కేవలం మనుషులు లేదా ఎద్దులతో చేసేలా తయారు చేయాలి అనుకున్నాడు. స్వంతంగా వెల్డింగ్ షాపు ఉండటంతో అటువంటి సాధనం తయారీకి పూనుకున్నాడు.

వరి విత్తనం మాత్రమే వేయడానికి పనికి వచ్చే ప్రస్తుత మార్కెట్‌లో లభించే డ్రమ్ సీడర్ స్థానంలో వరితో పాటు ఏ విత్తనమైనా వేయగలిగేలా బహుళ ప్రయోజనకారి డ్రమ్‌సీడర్‌ను రూపొందించాడు. రెండు మీటర్ల వెడల్పున్న ఈ డ్రమ్‌సీడర్ మూడు చక్రాల ఆధారంతో నడుస్తుంది. దీనికి 7 కొయ్యలను ఏర్పాటు చేశాడు. వాటిపైన రెండు డ్రమ్ములను ఏర్పాటు చేశాడు అందులో ఒకటి విత్తనాల కొరకు కాగా మరొకటి కలుపుమందు కొరకు ఏర్పాటు చేశాడు. దీనితో అవసరమనుకుంటే ఎరువులను కూడా విత్తనంతో పాటు వేసుకోవచ్చు అంటాడు బాబూరావు.

ఈ డ్రమ్ సీడర్‌ను ఇద్దరు వ్యక్తులు లాగుతూ వుంటే ఆటోమేటిక్‌గా విత్తనం వేయడం, వేసిన విత్తనాన్ని మట్టితో కప్పివేయటం ఆ తర్వాత కలుపుమందు పొలంలో పడేలా ఏర్పాటు చేశాడు. దీన్ని ఎద్దులతోనైనా లాగించవచ్చు లేదా డీజిల్‌తో నడిచే 4 హార్స్‌పవర్‌ల టిల్లర్ (మహిపాల్ చారి వీడర్ లాంటిది) తో కూడా లాగించవచ్చు. దీన్ని ఉపయోగించి కేవలం 2 గంటల్లో ఒక ఎకరంలో విత్తనం,



కలుపు మందులను వేయవచ్చు అంటాడు బాబూరావు.

ఈ డ్రమ్‌సీడర్ ప్రయోగాత్మకంగా తన పొలంతో పాటు పరిసరాల రైతుల పొలల్లో కూడా ప్రయోగించి చూశాడు. ఒక మీటరు వ్యాసం గల మూడు చక్రాలను అమర్చడంతో దీన్ని మనుషులు సులువుగా లాగేలా వుంది, విత్తనాలు, ఎరువులు, మందు ఒకేసారి చల్లగలిగే వీలుండే ఇటువంటి డ్రమ్‌సీడర్ ఇంతవరకు ఎవరూ రూపొందించ లేదు. దీని సహాయంతో వరి, వేరుశనగ, మొక్కజొన్న, అపరాలు లాంటి విత్తనాలన్నీ వేసుకోవచ్చు. దీన్ని మొత్తం ఇనుముతో తయారు చేయటం వల్ల బరువు ప్రస్తుతం దాదాపు 50 కిలోలు ఉందని, త్వరలో ఈ సాధనాన్ని స్టీల్‌తో తయారుచేసి బరువును సగానికి సగం తగ్గించాలన్న ఆలోచనలో వున్నాడు బాబూరావు. అప్పుడు రైతులు దీన్ని సులువుగా భుజాన వేసుకుని పొలానికి వెళ్ళవచ్చు.

ఫిబ్రవరి 4–6 తేదీలలో హైదరాబాద్‌లోని జాతీయ వృక్షారోగ్య యాజమాన్య సంస్థ (ఎన్.ఐ.పి.హెచ్.ఎం.) నిర్వహించిన ప్రదర్శనలో బాబూరావు ఇన్నోవేషన్‌ను ప్రదర్శించారు. దేశంలోని నలుమూలల నుండి వచ్చిన రైతులను ఇది బాగా ఆకట్టుకుంది. దీన్ని రూ. 30 వేల రూపాయలకు 15 రోజుల్లో తాను తయారు చేసి ఇస్తానని అంటున్నాడు బాబూరావు.



ఇతనొక సీరియల్ ఇన్నోవేటర్. ఎనిమిది సంవత్సరాల క్రితమే దాదాపు ఒకటిన్నర లక్షల విలువ చేసే చెఱకు కత్తిరించే ట్రాక్టర్ అనుసంధాన సాధనాన్ని తయారు చేశాడు. ప్రస్తుతం ప్రత్తిని కూడా విత్తేందుకు ఓ డ్రమ్ సీడర్ తయారు చేయాలని అనుకుంటున్నాడు.

బాబూరావు తయారు చేసిన ఈ పరికరాన్ని 'పల్లెసృజన' రాష్ట్రపతి అవార్డుకు పంపటం, పేటెంటు నమోదు చేయటం కార్యక్రమాలను చేపట్టింది. ఈ ఇన్నోవేషన్ గురించి వివరాలు కావాలనుకున్నవారు బాబూరావు ఫోన్ నెం. : 94409 40025 కి ఫోన్ చేసి పొందగలరు. ●

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



విక్రం రాథోడ్ సైకిల్ పంపు




రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం



గోపాల్ భిసే సైకిల్ నాగలి





మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959, సెల్ : 9866 00 1678.

**మీరు చివరిసారిగా ఒక ఇన్నోవేటర్‌ని ఎప్పుడు కలిశారు?**

# పల్లెసృజన వేదికగా జ్ఞాన వ్యాప్తి

## తల్లిని క్యాన్సర్ నుండి కాపాడే ప్రయత్నం చేసిన ఆలపాటి సుబ్రహ్మణ్య ప్రసాద్ అనుభవం



అతని పేరు "ఆలపాటి సుబ్రహ్మణ్యం ప్రసాద్". వయస్సు 45 సంవత్సరాలు. స్వగ్రామం నిజామాబాద్ జిల్లా, బోధన్. అక్కడ ఒక టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడీయన. ఈయనకు ఇద్దరు కుమార్తెలు ఒకరు కాలేజిలో, మరొకరు పాఠశాలలో చదువుతున్నారు. కొద్దిరోజుల క్రితం సాక్షి దినపత్రికలో "శ్రీశైలం చంద్రశేఖర్" గారిని గురించి పల్లెసృజన చేస్తున్న కృషిని తెలియజేసే వ్యాసం చదివాడు. ఇక ఆలస్యం చేయకుండా తన మదిలో చాలా రోజులుగా నిగూఢమైన క్యాన్సర్ మందును 'పల్లెసృజన' వేదిక ద్వారా సమాజానికి తెలియజేయాలి అని హైదరాబాద్ లోని పల్లెసృజన కార్యాలయానికి ఫోన్ చేసి బయలుదేరి వచ్చాడు. ఈ మందు ఏమిటి? దాని ప్రభావం ఎలాంటిది? దానివల్ల తనకు జరిగిన మేలు ఏమిటో ఆయన మాటల్లోనే మీకు తెలియజేస్తున్నాము.

సుబ్రహ్మణ్యం గారి తల్లిగారైన జయలక్ష్మి గారికి 2008వ సంవత్సరంలో "వక్షోజాల క్యాన్సర్" (బ్రెస్ట్ క్యాన్సర్) సోకింది. హైదరాబాద్ లోని యం.యన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో చూపించగా ఆమెకు "కిమో థెరఫీ", "రేడియో థెరఫీ" చికిత్సలు చేసి, ఆపరేషన్ కూడా చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ క్యాన్సర్ మళ్ళీ తిరగబడింది. ఆమెకు ఆపరేషన్ చేసిన చోట పుండు ఏర్పడింది. మరలా ఆసుపత్రికి వెళ్ళగా ఇక దీనికి చికిత్స చేయడం కుదరదు. ఆమె ఇక మూడు నెలలకు మించి బ్రతికే అవకాశాలు లేవు, ఉన్నన్ని రోజులు ఇంట్లోనే ప్రశాంతంగా ఉండనీయండి, ఇంటికి తీసుకు వెళ్ళండి అని సలహా ఇచ్చారు అక్కడి డాక్టర్లు. ఇక చేసేది లేక తన తల్లిగారిని ఇంటికి తీసుకు వచ్చాడు.

కన్నతల్లి బాధపడుతూ వుంటే చూస్తూ వుండలేని సుబ్రహ్మణ్యం 'మా అమ్మను బ్రతికించుకోవడానికి నేనేమీ చేయలేనా' అని ఆలోచించాడు. తనకు మేనమామ అయిన కల్వకుర్తి పట్టణంలో నివాసముండే వెంకటేశ్వర రావుకు విషయం చెప్పగా ఆయన తనకు లభించిన ఒక పాత గ్రంథాన్ని తీసుకు వచ్చి సుబ్రహ్మణ్యంకు ఇచ్చి ఇందులోని మందు తయారు చేసి అమ్మకు తాగించి చూద్దాం బాగైతే మన అదృష్టం కదా అనటంతో, ఇక ఆలస్యం చేయక వెంటనే అందులో వివరించిన విధంగా "రావిచెట్టు బెరడు 500 గ్రా., మునగ చెట్టు వేర్లు 250 గ్రా., వస చెట్టు వేర్లు 10 గ్రా" తీసుకుని ఒక లీటరు నీటిలో వేసి ఆ నీరు పావు వంతు అయ్యే వరకు మరగబెట్టి ఆ నీటిని వడగట్టి తన తల్లికి తాగించటం మొదలు పెట్టాడు.

ఆశ్చర్యంగా కేవలం 4 రోజుల్లో ఆమెలో మంచి మార్పు కనపడటంతో రక్త పరీక్ష చేయించాడు. ఆ



రక్తపరీక్షలో వారిని అబ్బుర పరిచేలా 'తెల్ల రక్త కణాలు' అభివృద్ధి చెందటం గమనించి ఈ మందు పని చేస్తుందని గ్రహించి ఎంతో ఆనందించారు. తన తల్లికి ప్రస్తుతానికి ఆరోగ్యం కుదుట పడటంతో సంతోషించాడు. కొద్ది రోజుల తర్వాత ఆమె తన మామూలు దినచర్య ప్రారంభించటంతో పాటు, అన్ని పనులూ చక్కగా చేయగలిగే స్థాయికి చేరుకుంది. అలా ఒక సంవత్సరం పైగా ఆరోగ్యంగా, ఆనందంగా తల్లిని చూసుకోగలిగాడు.

అయితే ఇక్కడే ఒక చిన్న నిర్లక్ష్యం వహించారు ఆ కుటుంబ సభ్యులు. ఇక రోగం నయమైనట్లే కదా అని 20 రోజులుగా మందు సేవించటం మానేశారావిడ. అలా మానేసిన కొద్ది రోజుల్లోనే జయలక్ష్మి గారికి ఆ రోగం తిరగబడటంతో కిందపడిపోయి పక్షవాతానికి గురై అనతి కాలంలోనే మరణించింది. తాము మందు మానేసి ఎంత పొరపాటు చేశామోనని వాపోయారు. తాము మందు వాడటంలో ఏదో పొరపాటు చేశామని గ్రహించి ఇలాంటి పరిస్థితి ఇతరులకు రాకూడదు అని ఈ మందును సమాజానికి తెలియజేస్తే బావుంటుందని ఆలోచించి 'పల్లెసృజన' ద్వారా తన తల్లికి చేసిన వైద్యాన్ని వివరించాడు సుబ్రహ్మణ్యం.

మూడు నెలల్లో చనిపోతుందని డాక్టర్లు నిర్ధారించిన తన తల్లి దాదాపు రెండు సంవత్సరాలు ఆరోగ్యంగా బ్రతకగలిగింది అంటే ఈ మందులో ఏదో అద్భుతమైన గుణం ఉంది. ఇది సమాజానికి తెలియజేస్తే ఎందరో క్యాన్సర్ నుండి కొంతయినా ఉపశమనం పొందుతారు కదా అన్నది సుబ్రహ్మణ్యం మనోభావం.

ఇక్కడ పాఠకులు గమనించాల్సింది ఏమిటంటే 'ఒక జ్ఞానం తనవల్ల అక్కడితో ఆగిపోకుండా పదిమందికి తెలియజేయాలనే తపన' గల వ్యక్తులు పల్లెసృజన పత్రిక పాఠకులు కావడం మాకెంతో ఆనందాన్నిచ్చింది. మీరు కూడా మీ సమీప వ్యక్తులు గాని, మీ కుటుంబ సభ్యులు గాని క్యాన్సర్‌తో బాధపడుతూ వుంటే ఈ ఔషధాన్ని వాడి చూడండి. ఇది వాడటం వల్ల నష్టమైతే ఏమీ లేదు. ఒకవేళ బాగు పడితే ఆనందమే కదా. చనిపోతున్నారన్న విషయం తెలిశాక వారిని ఆ చావునుండి కొద్దిరోజులు కాపాడుకోవటం, వారిని ఆరోగ్యంగా చూసుకోవడం ఆనందదాయకమే కదా.

ఈ మందును గురించి ఇంకా ఏవైనా వివరాలు కావాలనుకుంటే సంప్రదించవలసిన చిరునామా :
ఆలపాటి సుబ్రహ్మణ్య ప్రసాద్, బోధన్, నిజామాబాద్ జిల్లా.
ఫోన్ : 81438 30701.

**పాఠకులు మరో విషయం గమనించాలి. ఇది కేవలం ఆయన అనుభవం, అభిప్రాయం మాత్రమే. ఏ శాస్త్రవేత్తలు ఇంకా దీనిని నిర్ధారణ చేయలేదు. ఈ మందును ఉపయోగించుకోవడం పూర్తిగా మీ నిర్ణయమే. ఈ మందు ఉపయోగించి మీరూ లాభపడితే సుబ్రహ్మణ్యంగారు, పల్లెసృజన ఆనందిస్తుంది. ఒకవేళ పని చేయకపోతే సుబ్రహ్మణ్యం గారిని, పల్లెసృజనను బాధ్యులుగా చేయవద్దని సవినయంగా మనవి చేస్తున్నాం.**

**- ఎడిటర్**

## NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ


**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia. org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే**

## NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555

**కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.**

## పల్లెసృజన జ్ఞాన సంధానంతో

# రైతుకు కావలసిన స్ప్రేయర్ తయారు చేసిన పల్లె ఇన్నోవేటర్




గ్రామీణ స్థాయి సమస్యలకు గ్రామీణస్థాయి వ్యక్తులే సరియైన సమాధానాలు కనుగొనగలరు అని 'పల్లెసృజన' గట్టిగా నమ్ముతుంది. అదే చెపుతూ వస్తోంది. పల్లెసృజన ద్వారా ప్రజలకు అందించిన ఒక వార్త అవసరమున్న పల్లె ప్రజలకు ఏవిధంగా ఉపయోగ పడిందో తెలియజేసే సంఘటన మా దృష్టికి వచ్చినపుడు మా ఆలోచన సరియైనదేనన్న మా విశ్వాసం ద్విగుణీకృతమైంది.

'పల్లెసృజన' పత్రిక పాఠకుల హృదయాలకు ఎంతగా హత్తుకు పోయిందో చెప్పటానికి ఒక ఉదాహరణే ఈ సరికొత్త ఇన్నోవేషన్. తొలుత ట్రాక్టర్ ఆధారిత 'బూమ్ స్ప్రేయర్' తయారు చేసి 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించుకుని, తర్వాత మోటార్ సైకిల్ ఆధారిత 'మినీ బూమ్ స్ప్రేయర్' తయారు చేసి అందరికీ అందుబాటులోకి తెచ్చిన గుంటూరు జిల్లా నాగభైరువారి పాలెం గ్రామానికి చెందిన 'సయ్యద్ సుభాని' పల్లెసృజన పాఠకులకి సుపరిచితుడే.

ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం లోని 'బాణాపురం' గ్రామానికి చెందిన రైతులు "ఎ. సత్యనారాయణ, పి. మాధవరావు"లకు పల్లెసృజన ద్వారా సుభాని పరిచయమయ్యాడు.

ఈ రైతుల ప్రధాన పంట 'మిరప'. వారి పొలాల్లో మిరప పంట దాదాపు 3 అడుగుల వరకు పెరిగి వుంటుంది. ఈ పంటపై పురుగు మందులు పిచికారి చేయాలంటే ఇద్దరు వ్యక్తులు ఒక రోజంతా కష్టపడాల్సి వచ్చేది. కూలీల భారం రోజు రోజుకూ పెరుగుతున్న ఈ కాలంలో ఈ సమస్యను 'సుభాని' తీర్చగలడేమో అని భావించి అతనికి ఫోన్ చేసి పల్లెసృజన మిత్రులమని చెప్పి పరిచయం చేసుకుని తమ గ్రామానికి పిలిపించుకున్నారు.

సుభాని అక్కడికి వచ్చిన తర్వాత వారి పొలాన్ని చూపించి, ఈ పంటపై పిచికారి చేయటానికి ఏదైనా ఒక



కొత్తరకం స్ప్రేయర్ తయారు చేసి ఇవ్వగలరా అని, అయితే అది ట్రాక్టర్‌కు అనుసంధానంగా కాకుండా కేవలం ఇద్దరు వ్యక్తులతో పనిచేయగలగాలి, బండి లాగినట్లు లాక్కుంటూ వెళ్తే పిచికారి అయ్యేలా తయారు చేయమన్నారు. దానివల్ల పిచికారి సమయం వీలైనంత తొందరగా జరిగిపోవాలని అన్నారు. తైవాన్ స్ప్రేయర్లు మోయటం మావల్ల కావటం లేదు, పైగా పెట్రోలు ఖర్చు పెరిగిపోతోంది అన్నారు.

రైతుల అవసరాన్ని సవాలుగా స్వీకరించిన సుభాని తాను గతంలో తయారు చేసిన బూమ్ స్ప్రేయర్ అనుభవంతో 'మినీ బూమ్ స్ప్రేయర్' చేయాలనుకున్నాడు. అందుకు అవసరమైన 50 లీటర్ల నీటిని మోయగలిగేందుకు రెండు చక్రాలతో రిక్షాలా తయారు చేసి దానిపైన నీటి డ్రమ్మును, ఆ పక్కనే 12 వోల్టుల బ్యాటరీతో నడిచేలా 8 నాజిల్లు గలిగిన స్ప్రేయర్‌ను అమర్చాడు. బ్యాటరీని రాత్రిపూట చార్జింగ్ చేసుకుంటే దాదాపు 8 గంటల వరకు నిరంతరాయంగా పనిచేస్తుంది. ముందుభాగంలో ఒక వ్యక్తి గతంలో మనిషి లాగే బండ్లలాగా తయారు చేసి మనిషి ఈ రిక్షాను లాగుతూ వుండేలా అతని చేతివద్ద ఒక స్విచ్‌ను ఏర్పాటు చేశాడు. బండి లాగే వ్యక్తి అవసరమైనప్పుడు స్విచ్ వేస్తే వెనక భాగంలో అమర్చిన స్ప్రేయర్ మందును చిలకరిస్తుంది.

50 లీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంకు దాదాపు అర ఎకరం పైగా పిచికారి చేయవచ్చు. ఆ తర్వాత నీటిని, మందును మళ్ళీ నింపుకునేలా ఏర్పాటు చేసుకుంటే పంటలకు పిచికారి చేయటం సులువౌతుంది. స్ప్రేయర్‌ను లాగే మనిషి ఏదైనా ఆయాసం వచ్చినప్పుడు చేతిలోని స్విచ్‌ను ఆఫ్ చేయటం ద్వారా తగినంత విశ్రాంతి తీసుకుని మళ్ళీ పని మొదలు పెట్టవచ్చు. దీన్ని వాడటం వల్ల లాభాలు ఏమిటంటే మొదటగా పెట్రోలు లాంటి ఇంధనం ఖర్చు లేదు. పని త్వరగా అవటంతో రైతులు ఇతర పనులను చేసుకోవచ్చు. బరువులు మోయాల్సిన అవసరం లేకుండా పొలంలో మందును పిచికారి చేయచవచ్చు.

ఈ సాధనం నీటితో నిండిన డ్రమ్ముతో కలిపి మొత్తం దాదాపు 50 కిలోల వరకు బరువుంటుంది. 50 కిలోల బరువును లాగగలిగే వ్యక్తి ముందు నిలబడి దీన్ని లాక్కుంటూ వెళ్ళాలి. దీనికి 8 నాజిళ్ళను ఏర్పాటు చేయటంతో మిరప పంటలోని 8 వరుసలు మందుతో తడుస్తాయి. అంటే దాదాపు 25 అడుగుల వెడల్పులో పిచికారి చేస్తుంది. వెనకవైపు మరో వ్యక్తి మందు చిమ్మటాన్ని, డ్రమ్ములో నీరు లాంటి వాటిని గమనిస్తూ ముందు వెళ్ళే వ్యక్తికి సూచనలు ఇస్తూ వుంటే చాలు. ఒక గంటలో రెండున్నర ఎకరాల్లో మందును పిచికారి చేయవచ్చు.

అనుకున్న విధంగా స్ప్రేయర్‌ను తయారు చేసి బాణాపురం గ్రామానికి తీసుకు వచ్చి, సత్యనారాయణ, మాధవ రావుల పొలాల్లో మందును విజయవంతంగా





పిచికారి చేశారు. ఈ పరికరం తయారీకి దాదాపు 20 వేల రూపాయలు ఖర్చయ్యాయని, మేము అనుకున్న విధంగానే 'చిన్న బూమ్ స్ప్రేయర్'ను తయారు చేసినందుకు సుభానికి తమ కృతజ్ఞతలను తెలియజేశారా రైతులు.

స్ప్రేయర్‌ను ఒక మనిషి లాగాలి, రెండవ వ్యక్తి వెనక వైపు వుండి సూచనలిస్తూ, కొద్దిగా నెడుతూ వెనక పిచికారిని గమనిస్తూ వుండాలి అన్నారు రైతు సత్యనారాయణ. గతంలో ఈ స్ప్రేయర్ రాకముందు మామూలు డ్రమ్ము స్ప్రేయర్‌తో కూడా ఇద్దరు వ్యక్తులు కావాల్సి వచ్చేది అయితే దానితో చాలా సమయం పట్టేది. పైగా దీనితో స్ప్రే చేయటం పని త్వరగా జరగటమే కాక, మొక్కలకు దానికన్నా ఎక్కువగా పిచికారి బాగా జరుగుతుందని అంటున్నాడు సత్యనారాయణ అనే రైతు.

మహమ్మద్ సుభాని మొట్టమొదట చేసిన 'బూమ్ స్ప్రేయర్' అందరి మన్ననలు అందుకోవటం, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు చేసుకోవడంతో పాటు, ఎన్నో బహుమతులను కూడా అందుకుంది. తర్వాత చిన్న రైతుల కోసం మామూలు డ్రమ్ము స్ప్రేయర్‌కు నాలుగు నాజిళ్ళను ఏర్పాటు చేసి పంటలపై పిచికారి త్వరగా అయ్యేలా తయారు చేశాడు, ఆ తర్వాత మధ్యరకం రైతుల కోసం మోటార్ సైకిల్ తో నడిచేలా 'మినీ బూమ్ స్ప్రేయర్'ను తయారు చేశాడు. దీన్ని మహిళా రైతులు కూడా సునాయాసంగా నడిపేలా తయారు చేశాడు. అంతటితో ఆగక ఇప్పుడు కొందరు రైతుల కోరిక మేరకు అందరికీ అందుబాటులో వుండే ధరలో, ఎక్కువ విస్తీర్ణం గల పొలాన్ని తక్కువ సమయంలో, అతి తక్కువ ఖర్చులో పిచికారి చేసేలా ఈ 'చిన్న బూమ్



స్ప్రేయర్'ను తయారు చేసి రైతుల మన్ననలు అందుకున్న సుభాని 'పల్లెసృజన' పాఠకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు.

'పల్లెసృజన'కు తెలియకుండానే ఇద్దరు రైతులు ఒక ఇన్నోవేటర్‌తో అనుసంధానమై తమ అవసరాలను తీర్చుకున్నందుకు మేమెంతో గర్విస్తున్నాము. మాకు కావలసిందీ అదే. సమాజంలో ఆలోచనలు ఇలా సమానాంతరంగా ఒకరి నుండి మరొకరి వ్యాపించి, రైతుల మధ్య నిరంతరంగా జ్ఞాన ప్రసరణకు అవకాశం కల్పిస్తూ సమాజాభివృద్ధి సులభంగా, అందరికీ అందుబాటులో జరగాలని ఎల్లప్పుడూ ఆశిస్తోంది 'పల్లెసృజన'. ఈ కృషిలో బానాపురం గ్రామ రైతులకు, ఇన్నోవేటర్ సుభానిల మధ్య జరిగిన జ్ఞాన సంధానం ఒక చిన్న విజయం.

**ఇన్నోవేటర్ సుభాని ఫోన్**: 9848613687

**రైతు సత్యనారాయణ ఫోన్**: 9849179669



# మహిళలు వంటింట్లో బేకరీ పదార్థాలు తయారు చేసేందుకు స్టౌపైన పెట్టుకొనే చిన్న ఓవెన్

## చిడిపి నాగభూషణం మరో వినూత్న సృజన




రాజమండ్రికి చెందిన 'చిడిపి నాగభూషణం' పల్లెసృజన పాఠకులకు గుర్తుండే ఉంటారు. గతంలో (సెప్టెంబర్– అక్టోబర్–2010 పల్లెసృజన) ద్వారా బేకరీలలోని బిస్కట్లు, బ్రెడ్డు, కేకులు, క్రీంపఫ్స్ లాంటివి తయారు చేసేందుకు గ్యాస్‌తో పనిచేసే ఓవెన్‌ను తయారు చేసి అద్భుతమైన ఫలితాలను రాబట్టాడు. ఇప్పటికే రాష్ట్రమంతటా ఇతను తయారు చేసిన గ్యాస్ ఓవెన్లలో బేకరీ తినుబండారాలను తయారు చేస్తూ ఎంతో సమయం, ఖర్చు తగ్గించుకున్నారు బేకరీ యజమానులు.

రాజమండ్రికి చెందిన చిడిపి నాగభూషణం తాను తయారు చేసిన గ్యాస్ ఓవెన్‌తో ఆగిపోకుండా మహిళలు వంటింట్లో బేకరీ పదార్థాలు తయారు చేస్తే బాగుంటుంది కదా అని ఆలోచించాడు. అందరికీ అందుబాటు ధరలో ఉండేలా ఓవెన్ తయారు చేస్తే గ్రామాల్లో కానీ, పట్టణాల్లో కాని నిరుద్యోగ యువతీ యువకులు తమ ఇంటివద్దనుండే బేకరీ పదార్థాలను తయారు చేసుకుని అమ్ముకోవటం ద్వారా మంచి లాభాలను ఆర్జించవచ్చు కదా అని ఆలోచించాడు. చాలా చిన్నదైన (14 అంగుళాల ఎత్తు, 10 అంగుళాల వెడల్పు, 11 అంగుళాల పొడవు) స్టీలుతో ఓ చిన్న ఓవెన్‌ను తయారు చేశాడు. దీన్ని ఇంట్లో వున్న గ్యాస్‌పొయ్యిమీదకాని, కట్టెల పొయ్యిమీద కాని వుంచి అతి తక్కువ సమయంలో బేకరీ పదార్థాలు తయారు చేసుకోవచ్చు.

కేవలం 10 నిమిషాల్లో 16–20 బిస్కట్లు తయారౌతాయి. ఇద్దరు మనుషులు రోజుకు 8 గంటలు పనిచేస్తే వెయ్యి బిస్కట్లకు పైగా తయారు చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చు. ఈ ఓవెన్‌తో బిస్కట్లే కాక కేకులు, క్రీంపఫ్‌లు కూడా తయారు చేసుకుని ఎంచక్కా ఇంటివద్దనే బేకరీ వ్యాపారం కొనసాగించవచ్చు. బిస్కట్ల తయారీలో మాత్రం దీనికి మించిన నాణ్యత ఏ ఓవెన్‌లోనూ చేయలేరని గంటాపథంగా చెపుతున్నాడు నాగభూషణం. దానికయ్యే ఖర్చు కూడా చాలా స్వల్పం కాబట్టి యువతీ యువకులు దీన్ని వినియోగించుకుంటే బాగా లాభపడతారని అంటున్నాడు.

ఇలాంటి ఓవెన్ తయారు చేయాలని గతంలో పెద్ద ఓవెన్ (2010లో) తయారు చేసినప్పుడే అనుకున్నానని,




పల్లెసృజనలో గ్యాస్ ఓవెన్ గురించి ప్రచారం చేయటం వల్ల తనకు తీరిక లేనంతగా ఓవెన్‌లను తయారు చేసే పనిలో వుండిపోయి ఆలస్యం అయిందని అన్నారీయన. నాగభూషణం ఇప్పటికే మూడు రకాల ఓవెన్‌లను తయారు చేసి సమాజానికి అందించడం జరిగింది, ఇది నాలుగో ఓవెన్. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే దీనికి ప్రత్యేకంగా గ్యాస్ కనెక్షన్ ఇవ్వాల్సిన అవసరం లేదు. కేవలం ఈ ఓవెన్‌ని స్టౌమీద పెడితే చాలు. అంతే కాక కొంతమంది ప్రత్యేక కోరికపై 'కరీపఫ్' కూడా తయారు చేసే సదుపాయాన్ని కల్పించాడు. ఈ ఓవెన్ పైనవున్న వేడిని నియంత్రించే ఒక మరను క్రిందికి పైకి తిప్పడం ద్వారా బిస్కట్లు, కేకు, కరీపఫ్ తయారీకి కావలసినంత వేడి మాత్రమే వచ్చే అవకాశముంది. దీనివలన బిస్కెట్లు చెడిపోవు. కానీ కరీపఫ్ చేయాలి అనుకున్నపుడు మాత్రం కొంచెం ఎక్కువ వేడిని అందించాల్సి వుంటుంది. అటువంటప్పుడు పైనున్న మరను కొద్దిగా కిందకి తిప్పటం ద్వారా వాటికి అవసరమైన వేడి అందుతుంది. బహుశా పొయ్యిపైన వేడి చేయటం ద్వారా పదార్థాలు తయారయ్యే ఓవెన్ ఇదే మొదటికి కావచ్చు అంటాడీయన.

నాగభూషణం గారు వాళ్ళ అమ్మమ్మ గారైన 'అలీసమ్మ' వద్ద నుండి ఈ బేకరీ పదార్థాల తయారీ విధానాన్ని నేర్చుకొని, చిన్నప్పటినుంచి బేకరీలలో పనిచేస్తూ తన ఆలోచనా విధానానికి పదును పెట్టి ఈ ఓవెన్‌లు తయారు చేయటం ద్వారా తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నాడు. ఈ ప్రక్రియలో ఇతనికి భార్య పద్మ చేదోడు వాదోడుగా వుంటూ ఓవెన్‌ల తయారీలో తనవంతు పాత్రను నిర్వహిస్తుండగా, కొడుకు పాల్‌రాజు చదువుకుంటున్నాడు. ప్రస్తుతం ఈ ఓవెన్‌లను తయారు చేసే పనిలో దాదాపు 20 మంది యువతీ యువకులకు జీవనోపాధి పొందుతున్నారు.

బేకరీల సామర్థ్యాన్ని బట్టి వారికి అవసరమైన ఓవెన్ తయారు చేసి ఇవ్వటం ఇతని ప్రత్యేకత. ఇప్పటివరకు తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంకు సరఫరా చేసిందే అతిపెద్ద ఓవెన్ అన్నాడు నాగభూషణం. వారి అవసరాన్ని బట్టి తయారు చేసే ఓవెన్‌ను బట్టి వాటి విలువ రూ. 14 వేలనుండి 20 వేల వరకు వుంటుంది.

ప్రస్తుతం తయారు చేసిన ఈ చిన్న ఓవెన్ లో





ఇనుము, స్టీలు, జి.ఐ. లోహాలను ఉపయోగించాడు. దీని విలువ రూ. 5,500/–లు. కావలసిన వారు నాగభూషణం ను సంప్రదిస్తే ఒక వారం రోజుల్లో ఓవెన్‌ను సరఫరా చేస్తానంటున్నాడు. ఇందులో పని చేసేందుకు అనువైన సూచనలతో కూడిన కరపత్రాన్ని ఇస్తాడు. ఇంకా నైపుణ్యంతో చేయాలనుకుంటే అతని వద్దకు వెళితే అవసరమైన అన్ని శిక్షణలు ఇస్తాను అంటున్నాడు. ఇప్పటికే చాలామందికి తాను బేకరీ పదార్థాలు తయారు చేయటంలో శిక్షణ ఇచ్చాడు.

దీని బరువు కేవలం ఏడున్నర కిలోలు వుంటుంది కనుక ఈ ఓవెన్ ఎక్కడికైనా సులభంగా తీసుకుని వెళ్ళవచ్చు. ఎక్కువగా అవసరమైన వారి ఇంటికే వెళ్ళి కూడా బిస్కట్లు, కరీపఫ్‌లు, కేకులు తయారు చేసి ఇవ్వవచ్చు. ఈ ఓవెన్‌ను 'పల్లెసృజన' కార్యాలయానికి తీసుకు వచ్చి ఇక్కడ ప్రయోగాత్మకంగా తయారు చేసి పల్లెసృజన బృందానికి రుచి చూపించాడు. బిస్కట్లు చాలా రుచిగా, అందంగా వున్నాయి.

ఈ ఓవెన్ చిన్నదిగా, అనువుగా వుంటుంది, ధర కూడా అందుబాటులోనే వుంటుంది కనుక నిరుద్యోగ యువతీ యువకులకి ఉపాధి కల్పించటానికి మంచి మార్గం అని అంటాడు నాగభూషణం. తనకు ఎవరైనా ఆర్థికంగా సహాయం చేసేవారు ముందుకు వస్తే ఇంకా హెచ్చు సంఖ్యలో మేలైన ఓవెన్‌లు తయారు చేసి అందించే అవకాశం వుంటుంది అని చెప్పాడాయన.

నాగభూషణం గతంలో తయారు చేసిన మొబైల్



ఓవెన్ ద్వారా ఇప్పటికే ఎంతోమంది ఉపాధిని పొందుతుండటం విశేషం. ఒక టివిఎస్ బైక్‌పైన గ్యాస్ సిలిండర్, ఓవెన్, బిస్కట్లు పెట్టుకోవటానికి ఒక చిన్న రాక్‌తో మొత్తం సామాగ్రిని నాగభూషణమే అమర్చడం జరిగింది. దీనితో పట్టణాలు, గ్రామాల్లో తిరుగుతూ బిస్కట్లు అమ్ముకుంటూ కావలసిన వారికి అక్కడికక్కడే బిస్కట్లను కూడా తయారు చేసి ఇవ్వవచ్చు.

యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తక్కువ పెట్టుబడితో మీ ఇంటివద్ద నుంచే మీరు జీవనోపాధి పొందవచ్చు.

**సంప్రదించవలసిన చిరునామా :**

చిడిపి నాగభూషణం,
మునికొడలి, సీతానగరం, రాజమండ్రి రూరల్,
పశ్చిమ గోదావరి జిల్లా. ఫోన్ : 93940 79267





Vol-3, Issue - 5 PALLE SRUJANA March-April 2015 నివాళి

# రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పునాది స్థాయి ఇన్నోవేటర్‌కు

# అశ్రు నివాళి



## శ్రద్ధాంజలి

నేను పది సంవత్సరాల క్రితమే విక్రం రాథోడ్‌ను, వారి గ్రామస్తులను కలిశాను. అక్కడి జిల్లా కలెక్టర్‌కు విక్రం రాథోడ్‌ను పరిచయం చేసి, అతని ఇన్నోవేషన్ గురించి తెలియజేసి, ఇతను వృద్ధిలోకి రావాలని మనసారా కోరుకున్నాను. ఆంధ్రప్రదేశ్ లోని హనీబీఎపి కార్యకర్త అయిన బ్రిగేడియర్ గణేశం విక్రం రాథోడ్ ఇన్నోవేషన్‌కు ఎంతో చేయూతనిచ్చారు.

అందరు ఇన్నోవేటర్లలాగే ఇతనికి కూడా ఎన్నో కలలు. కానీ అన్నీ సాధ్యం కాలేదు. భూమ్యాకర్షక శక్తి ద్వారా నిరంతరంగా తిరిగే ఒక యంత్రాన్ని తయారు చేయాలనుకున్నాడు. కానీ అతని సైకిల్ పంపు బాగా పని చేసింది. అట్టడుగు కార్యకర్తలకు విక్రం ఎంతో స్ఫూర్తినిచ్చాడు.

ఒక లంబాడా తెగకు చెందిన వ్యక్తి రాజస్థాన్ నుండి 500 సంవత్సరాల క్రితం ఆదిలాబాద్ వచ్చి ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న మహారాణా ప్రతాప్ స్ఫూర్తి ఈయనను ముందుకు నడిపింది.

అతని ఆవిష్కరణ, స్ఫూర్తి కలకాలం వుండాలని కోరుకుంటున్నాను. అది అతని కుటుంబానికి స్ఫూర్తిదాయకం కావాలి.

అతని కుటుంబానికి ఆర్థిక సహాయం కావాలి. అందుకు మనమందరం ఇతోధికంగా పాలు పంచుకోవాలి. కొద్దిరోజుల క్రితం అతని భార్యతో మాట్లాడాను, అతని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...

**- ప్రొఫెసర్ అనిల్ గుప్త, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, ఎన్.ఐ.ఎఫ్., అహమ్మదాబాద్**

విక్రమ్ రాథోడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అతని లేమిని తీర్చుకోగల శక్తిని వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాలని కోరుకుంటున్నాను.

**- విపిన్ కుమార్,** డైరెక్టర్, ఎన్.ఐ.ఎఫ్.

శ్రీ విక్రమ్ రాథోడ్ అకాల మృత్యువు నాకెంతో బాధను కలిగించింది. అతని సైకిల్ పంపు ఆవిష్కరణ స్ఫూర్తి సంఘం పట్ల అతని ఆవేదనని చూపుతుంది. అలా చూసినప్పుడు అతని ఆవిష్కరణ మనకు ఎల్లకాలం స్ఫూర్తినిస్తూ వుంటుంది. అతని మరణానికి నా హృదయపూర్వక సంతాపాన్ని అతని కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ...

**- బలరాం సాహు,** భువనేశ్వర్.

చాలా విషాదకరం. నేను అతని ఆవిష్కరణ నుండి ఎంతో స్ఫూర్తిని పొందాను. దాని ప్రజాదరణకు ఎంతో కృషిచేసి అతని కుటుంబ సభ్యులకు ఇతోధికంగా సాయం చేస్తాను. అతని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

**- వినోద్ కుమార్,** ఎన్.ఐ.ఎఫ్.

కాశ్మీర్‌లోని అందరు ఆవిష్కర్తలు ఈ దుఃఖ సమయంలో అతని కుటుంబ సభ్యులకు తోడుగా వుంటారు.

**- జి.ఎమ్. భట్,** శ్రీనగర్, జమ్ము& కాశ్మీర్

మనం ఒక మాణిక్యాన్ని కోల్పోయాము. విక్రంగారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. అతను చేసిన సైకిల్ పంపు గురించి ఒక శోధయాత్రలో బ్రిగేడియర్ ద్వారా తెలుసుకొని ఎంతో ఆనందించాను. మనందరం కలిసి అట్టడుగు ఆవిష్కర్తలకు సహాయంగా ఏమైనా చేసి, తద్వారా ఇటువంటి క్లిష్ట సమయాల్లో వారిని ఆదుకోవచ్చు అని తలుస్తున్నాను. జైహింద్.

**- రాజేశ్వర్,** వాలంటీర్.



## కీ॥శే॥ విక్రం రాథోడ్

**మరణం : 24-2-1015**

సమాజానికి అందించిన మీ సృజనాత్మకతను 'పల్లెసృజన' ఎన్నటికీ మరువదు.
చదువు రాని పేటెంట్ హోల్డర్‌గా మీరు నమోదైనప్పుడు మాకు భవిష్యత్తుపై అచంచలమైన విశ్వాసం కలిగింది. అతి సామాన్య రైతులకు మీరందించిన ఇన్నోవేషన్ ఎప్పటికీ మేలు చేస్తూనే వుంటుంది. తద్వారా మీరు ఎంతోమంది రైతుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి వుంటారు. మీరు శారీరకంగా ఈ లోకానికి దూరమైనా, మీ ఇన్నోవేషన్ రూపలో ఎప్పటికీ బ్రతికే వుంటారు.
మీ ఇన్నోవేషన్‌కు విస్తృత ప్రచారం చేసి వీలైనంత మంది రైతు సోదరులు దీన్ని వినియోగించుకునేలా చేసి మీ కుటుంబానికి చేదోడుగా వుండటమే మేము మీకు అర్పించే అసలైన నివాళి.
మీ కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ
మీ ఇన్నోవేషన్ రూపంలో మీకుటుంబానికి ఎన్నటికీ చేరువగానే
వుంటామని అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తూ .....

**- 'పల్లెసృజన' కుటుంబం**







## ప్రగాఢ సానుభూతి

ఎంతో బరువైన హృదయంతో మేము శ్రీ విక్రమ్ రాథోడ్ అకాల మరణాన్ని తెలియజేయటానికి చింతిస్తున్నాము. అతను ఒక ఆదివాసి తెగకు చెందిన ఆవిష్కర్త. 24 ఫిబ్రవరి నాడు అతను మృతి చెందాడు. కొంత కాలంగా అతను మూత్రపిండాల వ్యాధితో బాధపడ్డాడు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కూతురికి వివాహం అయింది. ఒక రైతుగా, ఒక చక్కని మానవునిగా ఇతరుల కష్టాలను అర్థం చేసుకునే వ్యక్తిగా మనకు తెలుసు. అతను తన ఆవిష్కరణకు మెరుగులు దిద్ది, దాన్ని మరింత సమర్థవంతంగా రూపొందించాడు. అతని ఆవిష్కారానికి పెద్దల మద్దతు లభించింది. ఎన్.ఐ.ఎఫ్. ఐదవ ద్వైవార్షిక పోటీల్లో (2009) రాష్ట్రపతి పురస్కారం లభించింది. అతని ఈ ఆవిష్కరణను జనాదరణ పొందేవిధంగా కృషి చేద్దాం.

'పల్లెసృజన' ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు శక్తినివ్వాలని కోరుకుంటోంది.

**- బ్రిగేడియర్ పోగుల గణేశం,** ప్రెసిడెంట్, పల్లెసృజన

విక్రమ్ రాథోడ్ కుటుంబానికి నా సానుభూతి. భగవంతుడు వారికి శక్తినివ్వాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా అతని కుటుంబానికి ఇతోధికంగా ఆర్థిక సహాయం చేయటం మన కర్తవ్యం. అందుకై శ్రమించి కార్యరూపంలో పెడదాం.

**- డా. కల్పనా శాస్త్రి,** నారమ్, హైదరాబాద్.

విషాదకరమైన ఈ వార్త విన్నాం. మా ప్రార్థనలు. ఇలాగే మొదటి సంవత్సరం బహుమతి గ్రహీత కేరళ రాష్ట్రానికి చెందిన ఎ.జె. అబ్రహాం కొన్ని సంవత్సరాల క్రితం మరణించాడు. వారి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కూడా ఈమధ్యనే హృదయ సంబంధ వ్యాధితో కన్ను మూశారు. ఇలాంటి విషాధ వార్తలు కొందరు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ల కుటుంబాలకు మనం అందించాల్సిన ధైర్యం/సహాయం గురించిన విషయాన్ని తెలియజేస్తాయి.

**- జేమ్స్,** కేరళ

## విక్రం రాథోడ్ కుటుంబ సహాయ నిధి

కీ.శే. విక్రం రాథోడ్ కుటుంబానికి తోడుగా నిలవాలనే ఆశయంతో పల్లెసృజన **"విక్రం రాథోడ్ కుటుంబ సహాయ నిధి"**ని ప్రారంభించింది. నిధిలో జమ అయిన మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందించే బాధ్యత 'పల్లెసృజన'ది. సహాయం పంపదలచినవారు యం.ఓ./ డి.డి./ చెక్కు లను 'పల్లెసృజన, నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094' చిరునామాకు పంపగలరు. వాటి వెనకవైపు "విక్రం రాథోడ్ కుటుంబ సహాయార్థం" అని వ్రాసి పంపడం మరువకండి.

నిఫ్ట్/బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ చేసేవారికి బ్యాంక్ అకౌంట్ వివరాలు : **M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad. SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023** డిపాజిట్ చేసిన తర్వాత **president@pallesrujana.org**కు వివరాలు ఇ–మెయిల్ చేయగలరు.



# ఇగ్నైట్-14 విజేతలు

పిల్లలలో ప్రత్యేకించి బడి పిల్లలలోని సృజనాత్మకత, ఇన్నోవేటివ్ స్ఫూర్తిని కలిగించటం కోసం జాతీయ స్థాయిలో జరిగే పోటీయే 'ఇగ్నైట్'. పిల్లలు తమ స్వంత సాంకేతిక ఆలోచనలని, ఇన్నోవేషన్లని 'ఇగ్నైట్' కి పంపాలని కోరటం జరుగుతుంది.

సెప్టెంబర్ 1, 2013 నుండి ఆగష్టు 31, 2014 వరకు జరిగిన 'ఇగ్నైట్-14' జాతీయ స్థాయి పోటీలకు దేశంలోని 35 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 359 జిల్లాల నుండి 27,123 మంది పిల్లలు పాల్గొన్నారు. 'ఇన్నోవేషన్ రోజు' గా జరిగే డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి పుట్టిన రోజైన అక్టోబర్ 15న ఎన్.ఐ.ఎఫ్. ఈ పోటీల బహుమతులు ప్రకటించారు. ఐ.ఐ.ఎం. అహమ్మదాబాద్ లో నవంబర్ 19, 2014న అబ్దుల్ కలాం గారి చేతుల మీదుగా గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం జరిగింది. విజేతలు, వారి ఇన్నోవేషన్లను గతసంచిక తర్వాయి భాగం మీకందిస్తున్నాం


**మాటల స్థాయిని బట్టి ధ్వనిని నియంత్రించే మైక్రో ఫోన్ :**

**శర్వారి తంబత్, 10వ తరగతి, విజ్‌డమ్ ఇంటర్నేషన్ హైస్కూల్, నాసిక్ మహారాష్ట్ర.**



శర్వారి ఒకసారి ఒక కార్యక్రమానికి వెళ్ళినపుడు అక్కడ కళాకారుల మాటలు కొన్ని గట్టిగా వినిపించటం, కొందరి మాటలు వినిపించక పోవటం జరిగింది. అప్పుడు ఈమెకి ఒక ఆలోచన వచ్చింది. మైకులో మాట్లాడేవారి స్థాయిని బట్టి ధ్వనిని నియంత్రించే పద్ధతి వుంటే బావుండునని.

ఈమె హెచ్చు స్థాయిలో ఐక్యు వున్న పిల్లల క్లబ్ 'మెన్సా'లో సభ్యురాలు. ఈమెకి విషయాలను నిశితంగా గమనించటం, విశ్లేషించడం అలవాటు. పెద్దయ్యాక మానసిక శాస్త్రవేత్తను అవ్వాలనుకుంటోంది. ఆమె కథక్ నృత్యం నేర్చుకుంటోంది. ప్రదర్శనలు కూడా ఇచ్చింది.



**వ్యవసాయదారుల మేధోసంపత్తి హక్కులు కాపాడటానికి మీరు సిద్ధమేనా?**

**బొద్దింకల నుండి బయోఫర్టిలైజర్ :**

**అనన్య జైన్, 10వ తరగతి, క్యారమిల్ కాన్వెంట్ స్కూల్, చండీఘర్.**

అనన్య మిత్రులెప్పుడూ వాళ్ళ ఇళ్లల్లో బొద్దింకల సమస్యను గురించి చెపుతూ వుండేవారు. అది విన్న తర్వాత ఆమెకి ఈ బొద్దింకలన్నీ నలుగురికీ ఉపయోగ పడేలా ఎందుకు వాడకూడదు అన్న ఆలోచన వచ్చింది. దాని పర్యవసానమే ఈ ప్రయోగం. ఆమె బొద్దింకలను పెంచి, వాటి మలినాన్ని పూల కుండీలలో పెంచే మొక్కలకి వేసి చూడగా అవి ఏపుగా ఆరోగ్యకరంగా పెరిగాయి.

అనన్యకు పుస్తకాలు చదవటం చాలా ఇష్టమైన పని. టెన్నిస్ ఆడటం, ఫుట్‌బాల్ ఆడటం, గిటారు వాయించటం అంటే ఇష్టం. పెద్దయ్యాక ఇతరులకు స్ఫూర్తి కలిగించే మంచి మనిషిగా ఎదగాలని ఆమె కోరిక.



**కాలితో పెడల్ నొక్కితే చదువుతున్న పుస్తకం పేజి మారే సదుపాయం :**

**స్వాప్నిల్ తాలుక్‌దార్, 11వ తరగతి, మహర్షి విద్యామందిర్, గౌహతి, అస్సాం.**



రెండు చేతులూ లేనివారికి, లేదా గాయం వలన చేతులు వాడలేని వారి సదుపాయంకోసం పుస్తకం చదువుతున్నపుడు కాలితో ఒక పెడల్ నొక్కితే పుస్తకంలో పేజీ మార్చేలా ఒక సాధనం వుంటే బావుండునని స్వాప్నిల్ ఆలోచన.

స్వతహాగా కొంచెం బద్ధకస్తుడైన స్వాప్నిల్ ఒకసారి ట్యూషన్‌కని వెళ్లి బాగా అలసి ఇంటికి వచ్చి చదువుకునేటపుడు పుస్తకం పేజి కూడా తిప్పలేని పరిస్థితుల్లో ఈ ఆలోచన వచ్చిందట. తన ఆలోచన వలన చేతులు లేనివారికి, వాడలేని వారికి కూడా చాలా సదుపాయంగా ఉంటుందనిపించింది.

ఇతను భోజన ప్రియుడు. సుందరమైన ప్రదేశాలు చూడాలన్నా, తోటపని చేయాలన్నా, శాస్త్ర ఆధారిత కార్యక్రమాలు చూడాలన్నా, డ్యాన్సు చేయాలన్నా ఇతనికి చాలా ఇష్టం. ఇతనికి స్టాంపులు సేకరించడం హాబీ. తనవద్ద వెయ్యికి పైగా స్టాంపులున్నాయి. పెద్దయ్యాక రసాయన శాస్త్రంలో కాని, భౌతిక శాస్త్రంలో కాని, ప్రొఫెసర్ అయి తన విద్యార్థుల్లో కొత్తరకం ఆలోచనలు నింపాలని ఇతని ఆశ.

**మీ పిల్లల ప్రశ్నలకి సమాధానం తెలియదు అని మీరు చివరిసారిగా ఎప్పుడు ఒప్పుకున్నారు?**

**మాట్లాడే మాటల హెచ్చు తగ్గులను నియంత్రించే సాధనం :**

రింకూ యస్. రాజ్‌పాల్, **12వ తరగతి, ఆదాని విద్యామందిర్, అహమ్మదాబాద్, గుజరాత్.**





మాట్లాడే వ్యక్తి మెల్లిగా మాట్లాడినా, గట్టిగా అరిచినా వినేవారికి ఇబ్బందిగా వుంటుంది. అలా కాకుండా మాట్లాడే వ్యక్తి కోప్పడుతూ అరిచినపుడు ఒక స్థాయిని మించి గట్టిగా మాట్లాడుతున్నావు అని అతనికి తెలియ జేయటానికి అతని నోటిదగ్గర, మెడదగ్గర ప్రత్యేక సాధనాలు అమరిస్తే, గట్టిగా మాట్లాడినప్పుడు మెడదగ్గరున్న సాధనం అతనికి గుచ్చుకుని గట్టిగా మాట్లాడుతున్నావు అని హెచ్చరించాలి.

ఎదుటి వ్యక్తి గట్యిగా మాట్లాడుతూ వుంటే చికాకు పడినప్పుడు రింకూకి ఈ ఆలోచన వచ్చింది.


ఈమె జాతీయ స్థాయిలో చదరంగం ఆడుతోంది. ఆమెకి పుస్తకాలు చదవటం, ఫొటోగ్రఫీ, పాటలు పాడటం, డాన్సు, ప్రయాణాలు, స్కేటింగ్, బొమ్మలు గీయటం ఇతర సరదాలు. బయాలజీ ఆమెకి ఇష్టమైన సబ్జెక్టు. పెద్దయ్యాక డాక్టరు కావాలనుకుంటోంది.

**వికలాంగులు కారులోనుండి సులభంగా దిగటానికి తిరిగే కుర్చీ :**

కుష్ కుమార్ పటేల్, **12 వ తరగతి, నూతన్ విద్యావిహార్, హయ్యర్ సెకండరీ స్కూల్, అహమ్మదాబాద్, గుజరాత్.**

కారులో డ్రైవర్ సీటు తిరిగేలా, బయటికి వచ్చేలా వుంటే వికలాంగులకి కారులో ఎక్కడానికి, దిగటానికి, డ్రైవింగ్ చేయటానికి అనువుగా వుంటుంది అన్నది పటేల్ ఆలోచన. ఇలా వుంటే చేతి కర్రల ఆధారంగా నడిచేవారు కారులో కూర్చోవటం, కూర్చున్న తరువాత డ్రైవర్ సీటుని తమకి అనువుగా మార్చుకోవటానికి వీలవుతుంది. బాగా లావుగా వున్న వ్యక్తులకు కూడా ఇది అనువుగా వుంటుంది అంటున్నాడు పటేల్.

కొత్త టెక్నాలజీలు అంటే ఉత్సుకత చూపే ఇతను పాఠశాల చదువు అయ్యాక ఐఐటిలో చేరాలనుకుంటున్నాడు. ఇతనికి ధార్మిక చింతన ఎక్కువ. జీవిత కథలు చదవటం, ఫుట్‌బాల్ ఆడటం అంటే మక్కువ. జాతీయ స్థాయిలో సాఫ్ట్‌బాల్, రాష్ట్రస్థాయిలో బేస్‌బాల్ ఆడతాడు. అనేక టెక్నాలజీ కార్యక్రమాలలో పాల్గొన్నాడు.




**మీరు పునాది స్థాయి ఇన్నోవేటర్ల జ్ఞానాన్ని పదిమంది స్నేహితులతో ఎప్పుడైనా పంచుకున్నారా?**

**ఆధునీకరించబడ్డ గాలిమర :**

విదిత్ లాడ్, **12వ తరగతి, లోకమాన్య విద్యానికేతన్, ఇండోర్, మధ్యప్రదేశ్.**

గాలి మర తిరిగేటపుడు ఎటునుంచి గాలి వచ్చినా ఎక్కువ గాలి మరమీదికి వచ్చేలా ఏర్పాటు చేస్తే బావుంటుందని విదిత్ ఆలోచన. ఈ విధానంలో గాలి తక్కువగా వున్నా ఈ గాలిమర మాత్రం ఒకేస్థాయిలో తిరగేలా పని చేస్తుంది.



ఇతనికి సాంప్రదాయేతర ఇంధన వనరులపై మక్కువ ఎక్కువ. ఇతనికి ఈ ఆలోచన ఫిజిక్స్ పుస్తకం చదువుతూ వుండగా వచ్చింది. తనకు వచ్చిన ఆలోచనని ప్రయోగాత్మకంగా చేసి చూడటం ఇతనికి అలవాటు. గ్రౌండులో ఆటలు ఆడుకోవటం ద్వారా ఆరోగ్యంగా వుండవచ్చునని ఇతని నమ్మకం. పెద్దయ్యాక రక్షణ శాస్త్రవేత్త అయి దేశానికి కొత్తరకం ఆయుధాలు రూపొందించాలన్నది ఇతని కోరిక.

**త్వరగా ఛార్జ్ అయ్యే బ్యాటరీ :**

**యశ్వర్ధన్ గోయెంకా, 12వ తరగతి, కలకత్తా ఇంటర్‌నేషనల్ స్కూల్, కోల్‌కత్తా, పశ్చిమ బెంగాల్**





ఎక్కువ ఛార్జి సాంద్రతతో సూపర్ కెపాసిటర్స్ ఆధారంగా మామూలు బ్యాటరీలకన్నా త్వరగా చార్జి అయ్యే బ్యాటరీలు చేయగలగాలి అన్నది ఇతని ఆలోచన.

యశ్వర్ధన్ సెలవులలో తన తాతగారి ఊరు వెళ్ళినపుడు అక్కడ కరెంటు వస్తూ పోతూ వుండేది. కరెంటు వచ్చినపుడు కనీసం వున్న ఇన్వర్టర్ కూడా చార్జి అయ్యేది కాదు. అప్పుడు ఇతనికి తక్కువ సమయంలో చార్జి అయ్యే బ్యాటరీలు వుంటే బావుండునన్న ఆలోచన వచ్చింది.

ఇతనికి టెక్నాలజీ అంటే ఇష్టం. ఇతని ఆలోచనలు న్యూట్రినోస్ నుండి గ్రాఫైన్, అక్కడినుండి రోదసీ నౌకలు, పాలపుంతల దాకా పోతూ వుంటాయి. ఇతనికి ప్రయాణాలన్నా, దూరం నడవాలన్నా, పెయింటింగ్ అన్నా చాలా ఇష్టం. ఇతను ఇంజనీరై కొత్త వస్తువులను డిజైన్ చేసి వ్యాపారవేత్తను అయిపోవాలని కోరిక. తనచుట్టూ వుండేవారి సమస్యలకి పరిష్కారం కనుగొనాలనే తపన వుంది.

**గనులలో పనిచేసే వారికి ప్రత్యేకమైన హెల్మెట్:**

ప్రేయాన్స్ కోటేఛా మరియు కరన్ కఠారి, **10వ తరగతి, 11వ తరగతి, ఆనంద్ విద్యావిహార్, వడోదర, గుజరాత్.**



గనులలో పనిచేసే కార్మికులు మరియు అధికారులు హెల్మెట్ వాడటం తప్పనిసరి. ఆ హెల్మెట్లకి ప్రత్యేకమైన సెన్సార్లు అమరిస్తే వారు గనులలో ఏమూల వున్నారో తెలుసుకోవటం సులభమవుతుంది. అలాగే వారితో మాట్లాడే సదుపాయం కూడా ఏర్పాటు చేయవచ్చు అన్నది ఈ ఇరువురి ఆలోచన. ప్రత్యేకించి గనులలో పరిస్థితి తెలుసుకోవటానికి లేదా ప్రమాదాలు జరిగినపుడు ఇటువంటి ఆధునక హెల్మెట్లు చాలా ఉపయోగంగా ఉంటాయని వీరి ఆలోచన.

కరన్ కి ఫొటోగ్రఫీ అన్నా, ఫుట్‌బాల్ ఆడటం అన్నా, కొత్తవారితో స్నేహం చేయాలన్నా, కొత్త ప్రదేశాలు చూడాలన్నా ఇష్టం. పెద్దయ్యాక తన తండ్రిలాగానే వ్యాపారవేత్త అవ్వాలని, కాకపోతే తనకి మక్కువ వున్న ప్రయోగాలకై డబ్బు ఖర్చు పెట్టుకోవాలని కోరిక.

ప్రియాన్స్‌కి కొత్త విషయాలు తెలుసుకోవటం, రూపొందించటం అంటే ఇష్టం. తన ఆలోచనలకి సహాయకారిగా వుండే వ్యాపారం చేయాలన్నది అతని కోరిక.

**స్కూలు, కాలేజి విద్యార్థులకు గ్రామీణ జ్ఞానం గురించి అవగతం చేయండి.**
**వారిని గ్రామ సమస్యలకు పరిష్కారాలను వెతకటంలో భాగస్వాములను చేయండి.**





# 15వ చిన్నశోధయాత్ర

**2015 మే, 15-17 తేదీలలో**

**విజయనగరం జిల్లాలోని**

**పార్వతీపురం-సాలూరు గ్రామాల మధ్య** జరుగుతుంది.

పాల్గొనాలనే ఆసక్తి కలవారు వివరాలు/ పేరు నమోదు కొరకు

**www.pallesrujana.org**
వెబ్‌సైట్‌ను చూడండి లేదా

**పల్లెసృజన** కార్యాలయాన్ని సంప్రదించండి.

**ఫోన్ : 040-27111959**




**యం. శైలేంద్ర:**

నాకీ యాత్రలో ప్రకృతి, పశువులు, మానవుల మధ్య సహజీవనం ఏ స్థాయిలో వుండాలో అర్థమైంది. ప్రకృతిని రక్షించుకోవటం మానవుల కర్తవ్యమే కాదు, తప్పనిసరిగా చేయవలసిన పని. యాత్రలో తాము ఆరుబైట పడుకుంటూ, పశువులకి దోమతెరలు వేసి వాటిని కాపాడుకుంటున్నారంటే పల్లెవాసుల హృదయం ఎంత సున్నితంగా వుంటుందో అర్థమైంది. ప్రకృతి, పశువులు కలిసి సహజీవనం చేస్తున్నారు కనుకనే వారికి పక్కవాడి కష్టాలు అర్థం చేసుకునే మనసుంటుంది. ఆ కష్టాలను వారి ఆలోచనలే తీర్చగలవు.

కొన్ని ఆలోచనలు వారి మనసుల్లో ఎంత లోతుగా నాటుకుపోతాయంటే ఉప్పు తయారు చేసే లక్ష్మణ్ తాను చిన్నప్పుడు మిలట్రీలో చేరాలనుకునే వాడట! నాకు సాధ్యం కాలేదు సార్, మీరు మిలట్రీ కదా ఇప్పుడు మా అబ్బాయిని చేర్చే అవకాశం వుంటుందా? అని బ్రిగేడియర్ గణేశం గారిని అమాయకంగా అడిగినప్పుడు చలించిపోయాను.

నా పెన్నులోనే వీడియోగేమ్ ఎందుకు ఉండదు అని ఓ చిన్న పాప అడిగినప్పుడు 'ఔరా' అనిపించింది. చిన్న పిల్లల ఆశ్రమంలో ఒక బాలుడ్ని అతని తల్లిదండ్రుల గురించి అడిగినప్పుడు నాకే కాదు, మా అందరికీ శరత్ సారే తల్లి, తండ్రి అని ఖచ్చితంగా చెప్పినపుడు మా హృదయాలు ద్రవించాయి. అనాథ పిల్లలను (వాళ్ళను అనాథలు అనకూడదు) అక్కున చేర్చుకున్న శరత్ గారికి రెండు చేతులు జోడించి మొక్కాము......

**గీతా సాయి క్రిష్ణ:**

నాకు ఈ శోధయాత్రలో ఎదురైన అనుభవాల ద్వారా చాలా నేర్చుకున్నాననే చెప్పాలి. దీనికి ముఖ్య కారణం బ్రిగేడియర్ గారని చెప్పక తప్పదు.

ఒక గ్రామంలో బ్రిగేడియర్ గారు ఈరోజుల్లో




అందరూ విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడుతున్నారు, నిజానికి మనం వాడే ఎరువులో కేవలం 30 శాతం మాత్రమే ఉపయోగ పడి మిగిలినదంతా వృధా అవుతుందీ అని చెప్పినపుడు అక్కడి గ్రామస్తులు ఇకపై ఎరువుల వాడకంలో చాలా జాగ్రత్తగా వుంటామండీ అని మాట ఇచ్చారు. ఇక్కడ చెప్పే విషయము, చెప్పే పద్ధతి కూడా చాలా ముఖ్యమని తెలుసుకున్నాను.

ఇంకొక గ్రామంలో 'సోలార్ స్ప్రేయర్' గురించి చెప్పి, కావాలంటే మీరు వాడి చూడండి అని వారి చేతికిచ్చాము. ఒకతను ముందుకు వచ్చి తాను కొంతసేపు వాడి, తర్వాత అది ఎంత బావుందో తోటి రైతులకి మా అందరికన్నా బాగా చెప్పాడు. అప్పుడనిపించింది, వాళ్ళ సమస్యలకి తగ్గ పరిష్కారాలిస్తే తప్పకుండా ఆచరిస్తారని.

పిల్లల ఆశ్రమంలో శరత్ గారు తాను ఎన్నో కష్టాలు, ఇబ్బందులు వచ్చినా వెరవకుండా ఆ ఆశ్రమాన్ని ఎలా కొనసాగిస్తూ వృద్ధి చేస్తూ వచ్చారో చెప్పినపుడు మనం నమ్ముకున్నదేదైనా మంచిదైతే దాన్ని పట్టుదలతో సాధించాలేగాని, మధ్యలో వదిలి వేయకూడదు అని తెలుసుకున్నాను.......

**సమీర్ రాజా:**

ఎన్.ఐ.టి. వరంగల్ నుండి నేను శోధయాత్రలో పాల్గొనాలని నిర్ణయించుకున్నపుడు ఒంటరిగా ఎలా వెళ్ళాలా అనుకుంటూ వుంటే ఇంకొక ఐదుగురు మేమూ వస్తాం అన్నారు. ఎన్.ఐ.టి. నుంచి ఆరుగురం బయలుదేరాం. అనివార్య కారణాల వల్ల కొంత ఆలస్యంగా యాత్రలో చేరాం. బ్రిగేడియర్ గారు ముందుగా ఇన్నోవేటర్లను గురించి చెపుతూ మోటార్ బైక్‌లకి పంచర్ కాని ట్యూబు ఒక గ్రామీణుడు తయారు చేశాడు అని చెప్పినపుడు యాత్ర గురించి అర్థమైపోయింది మాకు. రోజూ రాత్రిపూట యాత్రీకులమంతా కూర్చుని ఆరోజు అనుభవాలు చెప్పుకుంటున్నపుడు వింటే చాలు క్లాసుల్లో కూర్చుని ఎంత విన్నా తక్కువే. వెస్ట్ గోగులపల్లి గ్రామంలో గ్రామాలని పరిశుభ్రంగా వుంచాలని అదే ఇపుడు జాతీయ నినాదమని మాట్లాడుకుంటూ వుంటే అక్కడ లక్ష్మణ్ అనే ఆయన దీనికి మోడీ గారు రావక్కర్లేదు సార్, మేమంతా కలిసి మా గ్రామాన్ని పరిశుభ్రంగా మార్చుకుంటాం అని మాట ఇచ్చినపుడు వాళ్ళ గ్రామ బాగోగులను గురించి వారికి మంచి అవగాహన వుంది అనిపించింది.

బ్రిగేడియర్ గారు స్కూలు చదువు కూడా పూర్తి చేయని మల్లేశం తయారు చేసిన 'ఆసు యంత్రం' గురించి చెప్పినపుడు ఒక గ్రామస్తుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు సంపాదించుకోవడం ఎంతో గొప్ప కదా అనిపించింది. అలాంటి మల్లేశాలని వెతికి, వెలుగులోకి తేవడం మనందరి కర్తవ్యమేమో అనిపించింది. పిల్లల ఆశ్రమానికి వెలుతున్నపుడు ఒక వందమంది పిల్లలు ఎదురొచ్చి మాకు స్వాగతం పలికినపుడు కన్నీళ్ళు ఆగలేదు. చిన్నగా ప్రారంభమైన ఆ ఆశ్రమంలో ఇప్పుడు శరత్ గారి ఆధ్వర్యంలో 120 మంది భావి భారత పౌరులు చక్కగా తయారౌతున్నారంటే అది శరత్ గారి అంకిత భావానికి నిదర్శనం......

**నూకల అఖిల:**

మళ్ళీ శోధయాత్ర వెళ్తున్నానోచ్..... నాకిది నాలుగోసారయినా, మొదటిసారి వెళ్తున్నంత ఉత్సుకత చోటు చేసుకుంది నాలో. పేస్‌బుక్‌లో, ఫోన్‌లో స్నేసితులతో యాత్ర గురించి మాట్లాడుతూ రోజులు లెక్కపెట్టుకోసాగాను. డిసెంబర్ 25 రానేవచ్చింది. రావటమేంటి, మూడు రోజుల శోధయాత్ర మిగిలిన శోధయాత్రలకన్నా బాగా జరిగింది. దానికి కారణం బ్రిగేడియర్ గారు ఎప్పుడూ చెప్పే నలుగురు గురువులు.... 1. ప్రకృతి, 2. గ్రామస్తులు, 3. తోటి యాత్రీకులు, 4. స్వయంగా నువ్వు..... ఈసారి స్వయంగా



నేను నా బుర్రలో ఇంకే ఆలోచనా లేకుండా గ్రామస్తులకి ఏదో చెబుదాం అని కాకుండా, వారిదగ్గర నుంచి నేర్చుకుందాం అని వెళ్ళాను. నిజంగా చాలా నేర్చుకున్నాను. నేను నేర్చుకున్నవి క్లుప్తంగా చెప్పేస్తా.....

1. గ్రామస్తులు మనము అనుకున్నంత అమాయకులు కాదు. చెప్పవలసిన పద్ధతిలో చెప్తే ఏదైనా చేయగలరు.

2. పట్టణాల ప్రభావం వారిమీద పడి అనవసరపు హంగులు సమకూర్చుకొని అప్పుల పాలైపోతున్నారు.

3. పట్టణాల బడిపిల్లల ఆలోచనలతో పోలిస్తే, పల్లెటూర్లోని బడిపిల్లలు అమాయకంగా వున్నా, సూటిగా వున్నాయి.

4. వాళ్ళకున్న వనరులలో వారి అవసరాలు తీర్చుకోవటం వారికి బాగా తెలుసు.

5. ఇతరులకు సహాయం చేయాలన్న గుణం పట్టణాలవారికన్నా, పల్లటూరి వారికే ఎక్కువ.

6. నేను ప్రత్యేకంగా నేర్చుకున్నది ....

– ఇతరులతో ఎలా మాట్లాడాలి?

– ఇతరులకి అర్థమయ్యేలా ఎలా చెప్పాలి?

– గ్రామస్థాయి ఇన్నోవేటర్లు ఏ పెద్ద సైంటిస్టులకి తీసిపోరు.

– ఉప్పు తయారు చేసే విధానం.

– ఇటుకల బట్టీల పనితీరు.

– నిర్ణయాలు తీసుకునేటపుడు ఇతరుల అభిప్రాయాలతో పాటు మీ స్వంత అభిప్రాయమూ ముఖ్యం.

– బ్రిగేడియర్ గారు చెప్పిన నలుగురు గురువులని నమ్ముకుంటే గ్రామీణ వికాసానికి చేయూతనిచ్చినవాళ్లం అవుతాం.

– చిన్నపిల్లల ఆశ్రమాన్ని నడిపిన శరత్ గారు నా దృష్టిలో నిజమైన హీరో.

యాత్ర మొత్తం ఒకయెత్తయితే యాత్రలో బ్రిగేడియర్ గారు ప్రతి విషయాన్ని విశ్లేషిస్తూ చెప్పడం ఒకయెత్తు. ఆయన గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్ల గురించి కథలు కథలుగా చెప్పిన వివరాలు ఎవరినైనా ప్రోత్సహించక మానవు. ఆయన ఓపికకి మా జోహార్లు.

త్వరలోనే అందరినీ మళ్ళీ కలుస్తానని ఆశిస్తున్నాను.

**విష్ణు మనోజ్:**

మీరందరూ కాదన్రా నేను వివరంగా చెప్తా వుండండి..... నిజం చెప్పాలంటే 'పల్లెసృజన' నిర్వహించే 'శోధయాత్ర'లో ఈసారి కూడా తప్పకుండా పాల్గొనాలి అని మనసులో నిర్ణయించుకున్నపుడే నా యాత్ర మొదలైపోయింది అని చెప్పాలి. యాత్ర గురించి ఊహించుకుంటూ రోజులు లెక్కపెట్టుకోసాగాను. యాత్రలో ముఖ్య నిర్వాహకుడు, నా సహ ఉద్యోగి అయిన 'భాను'తో కలిసి బైటనుంచి వచ్చే యాత్రీకులకి స్వాగతం చెప్పటానికై 'కావలి' రైల్వేస్టేషన్‌లో నేను మొట్టమొదట చూసింది నరేష్ భయ్యాని. ముందుగా ముఖం చూస్తే అంత సరదా అయిన మనిషి అనిపించలేదు కానీ, యాత్ర పూర్తయ్యేసరికా నా అభిప్రాయాన్ని మార్చుకున్నాను..... అంటూ మనోజ్ తన



అనుభవాలను మొదలు పెట్టాడు. అంతా కలిశాక బ్రిగేడియర్ గణేశం గారు యాత్ర ప్రారంభించేముందు "మీకున్న అభిప్రాయాలు మర్చిపోండి, స్వచ్ఛమైన మనస్సుతో కొత్తవి తెలుసుకోవాలనే ఆలోచనతో ఈ యాత్రలో పాల్గొనండి" అని చెప్పారు. దీనిని 'అన్ లర్నింగ్' అంటారు. ఈ ఆలోచన మాకు ఈ యాత్రలో చాలా సహాయం చేసిందనే చెప్పాలి.

కావలి నుండి పల్లెవెలుగు బస్సులో 'ఉలవపల్ల' రహదారి దగ్గర దిగాము. ఈసారి నేను గుంపు ముందు కాక, గుంపులో చేరి నడుస్తూ చాలామందితో మాట్లాడాలని నిర్ణయించుకున్నాను. ఈవిధంగా చేసినందువల్ల చాలా విషయాలే తెలుసుకో గలిగాను. ఉలవపల్ల గ్రామంలో గ్రామస్తులతో కలిసి వారి జీవనశైలి గురించి తెలుసుకున్నాము. పంటలు, వారి ఆహారం, వారి ఆర్థిక పరిస్థితులను గురించి వారు చెపుతూ వుంటే నిజంగా జీవితంపైన, సామాజిక పరిస్థితులపైన వారికెంత అవగాహన వుందోకదా అనిపించింది. పల్లెటూరి వాళ్ళను తక్కువ అంచనా వేయకూడదని మరోసారి తెలుసుకున్నాను. వారు కొత్త టెక్నాలజీపై చూపిన ఆసక్తి నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అక్కడొక పెద్దాయన తన తరం గురించి చెపుతూ ప్రస్తుత తరంలో వ్యవసాయంలో వస్తున్న మార్పులను గురించి చాలా చక్కగా వివరించాడు. అప్పుడు బ్రిగేడియర్ గారు అసలు వ్యవసాయంలో రసాయన ఎరువులు వాడటం ఏవిధంగా ప్రారంభమైంది, దానిని



సరిగా పాటించక స్వార్థంతో ఏవిధంగా దుర్వినియోగం చేస్తున్నామో, దాని కారణంగా భూమికి, సమాజానికి ఎంత హాని జరుగుతుందో వివరించారు. ఆయన మాట్లాడుతూ వుంటే అలా వింటూ ఉండిపోవాలనిపించింది. కానీ యాత్ర సాగాలి కదా! ఆ పెద్దాయన్ను శాలువాతో సత్కరించి 'సింగపేట' గ్రామానికి వెళ్ళాము.

సింగపేట గ్రామంలో బడిపిల్లలతో కలిసి చాలాసేపు మాట్లాడాము. అప్పుడు వాళ్ళు చెప్పిన ఆలోచనలు వింటుంటే ఆశ్చర్యమేసింది. పిల్లలు కాదు వీళ్ళు పిడుగులు అనిపించింది. వాళ్ళ మాటలతో ప్రయాణపు అలసట, నొప్పులు మర్చిపోయి, కొత్త ఉత్సాహం వచ్చింది. అక్కడినుండి 'వెస్ట్ గోగులపల్లి' గ్రామానికి వెళ్ళే దారిలో దాదాపు 97 సంవత్సరాల వయసు గల ఒక పెద్దమనిషిని కలిశాము. ఆయన ఎన్నో పద్యాలు, పాటలు వినిపించాడు, ఎన్నో విషయాలను ఉత్సాహంగా చెప్పాడు. ఆ వయస్సులో కూడా ఆయన జ్ఞాపక శక్తికి జోహార్లు అర్పించకుండా ఉండలేక పోయాము. ఈతరం పిల్లలు చెడు మార్గాలు పట్టకుండా జీవితాలను సార్థకం చేసుకోవాలని సలహా ఇచ్చారు. ఆయన దగ్గర సెలవు తీసుకొని 'వెస్ట్ గొల్లపల్లి'కి బయలుదేరాము. అక్కడికి చేరేసరికి రాత్రి తొమ్మిదయింది. అందరం అలసిపోయాము. అయినా అలుపెరుగని బ్రిగేడియర్ గారు మాతో వుండగా మాకేం తక్కువ అని ఆయనతో కలిసి మా చుట్టూ చేరిన గ్రామస్తులతో మాటల్లో పడ్డాము. వారందరికీ కాలుష్యం పెంచని సోలార్ స్ప్రేయర్‌ను గురించి మేము చెప్పిన విషయాలు చాలా నచ్చాయి. సరే ఆ రాత్రికి మాటలు ముగించి నిద్రకు ఉపక్రమించాము కానీ, బాబోయ్ దోమలు... మమ్మల్ని ఎత్తుకెళ్ళి పక్కన పడేసేంత వున్నాయి. ఎలారా బాబూ అని అనుకుంటూ వుంటే కాళహస్తివాసి మన ఇన్నోవేటర్ 'చంద్రశేఖర్' గారి శ్రీతైలాన్ని బయటికి తీశారు బ్రిగేడియర్ గారు. అది ఒళ్ళంతా పూసుకుని నిద్రపోయాము. ఒక్కదోమా మా జోలికి రాలేదు. బహుశా చంద్రశేఖర్ గారిమీద కోపంతో కాళహస్తికి వెళ్ళుంటాయేమో!.

మర్నాడు కాలకృత్యాలు తీర్చుకుని 'ఉప్పుమళ్ళు' (కోటరీ) చూడటానికి వెళ్ళాము. అక్కడ లక్ష్మణ్ అనే ఆసామి

ఉప్పు తయారు చేయటం గురించి ఎన్నో విషయాలు చెప్పాడు. ఇందులో నాకు నచ్చినవి ఉప్పు తయారు చేసి ప్యాకెట్లు కట్టేటపుడు కరెంటు వాడకుండా (అసలు ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియదు) సీలు చేసే పద్ధతి బావుంది. ఆయన ఏమీ చదువుకోకపోయినా, ఇంజనీరింగు, మేనేజ్‌మెంటు, రిస్క్ మేనేజ్‌మెంట్ లాంటి అంశాలపై ఎంత చక్కగా మాట్లాడాడో అనిపించింది.

బ్రిగేడియర్ గారు రోడ్డుకి ఇరువైపులా జనులు విచ్చలవిడిగా మలమూత్రాల విసర్జన చేయటం గమనించా నని చెప్పగా ఎంతో నమ్మకంతో మా ఊరిని బాగు చేయటానికి ప్రయత్నిస్తాను సార్ అన్నారు. అతని కళ్లలో నిజాయితీ చూస్తే చేయగలడనే అనిపించింది.

అక్కడినుండి 'పురిణి' గ్రామానికి బయలుదేరాము. అక్కడ కావలి ప్రాంతంలో ఈ శోధయాత్ర నిర్వహించటానికి ముఖ్య కారకుడైన గ్రామ సర్పంచ్ శ్రీ రాంబాబు గారిని కలిశాము. భోజనం తర్వాత (నేను భాను ఒకే కంచంలో తిన్నాము. అందుకనేమో చాలా రుచిగా వుంది) బడి పిల్లలతో చాలాసేపు మాట్లాడాము. వాళ్ళ ప్రశ్నలు సూటిగా తాకాయి మాకు. ఒక పిల్ల అడిగింది.... 'పల్లెల్లోనే చెట్లు ఎందుకు ఎక్కువగా ఉంటాయి?, మీ పట్టణాలు చాలా పెద్దవి కదా అక్కడ ఎక్కువ చెట్లు ఎందుకు ఉండవు?' అని. నాకు సమాధానం దొరకలేదు. మీకు తెలిస్తే చెప్పండి. పల్లెలు శుభ్రంగా ఉండాలి. దానికి తగ్గ ఏర్పాట్లు చేయండని సర్పంచ్ గారిని సూటిగా అడిగారు పిల్లలు. వాళ్ళ ధైర్యం చూస్తే



ఆశ్చర్యం వేసింది.

అక్కడినుండి 'మూపూరు' బయలుదేరాం. మార్గం మధ్యలో బ్రిగేడియర్ గారు అనేక గ్రామస్థాయి ఇన్నోవేషన్ల గురించి, ఇన్నోవేటర్లను గురించి కథలు కథలుగా చెప్పారు. కన్నతల్లి కష్టాలు చూడలేక ఆమె పేరునే 'లక్ష్మి ఆసు యంత్రం' కనుగొన్న 'మల్లేశం' గురించి చెపుతూ వుంటే నేను మొదటిసారి శోధయాత్రలో పాల్గొన్నప్పుడు (6వది) ఆయన గురించి విని ఇంటర్‌నెట్‌లో వెతికి, అతని గురించి తెలుసుకున్న అనేక విషయాలు గుర్తుకొచ్చాయి. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మల్లేశంకు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది అంటే దానికి కారణం అతని కృషి, పట్టుదలే మరి.

'నార్త్ మూపూర్' చేరుకుని మా కార్యక్రమం ప్రకారం రైతులను కలవాలనుకున్నాము. ఒక్క రైతూ రాలేదు. వచ్చిన కొందరు నిలబడే ఉన్నారు. ఎందుకు అని అడిగితే కుర్చీలు లేవన్నారు. మేమే క్రింద కూర్చునేసరికి అందరూ మాతో కలిసి కూర్చున్నారు. తర్వాత కుర్చీలు వచ్చాయి, చాలామందీ వచ్చారు. అక్కడ మేము వివిధ ఇన్నోవేషన్ల గురించి మాట్లాడుతూ వుంటే, ఎంత శ్రద్ధగా విన్నారంటే మధ్యలో ఒక తాగుబోతు అల్లరి చేస్తూవుంటే అతన్ని బలవంతాన బైటకి పంపించేసి మరీ విన్నారు. తర్వాత కొంతసేపు తాగుడు వ్యసనం వల్ల పల్లెల్లోని కుటుంబాలు ఎలా పతనమై పోతున్నాయి అన్న విషయంపై చర్చ జరిగింది. నిజమే! తాగుడు మంచిది కాదు అన్న విషయంపై ఏకాభిప్రాయం రావటం మంచి పరిణామంగా తోచింది నాకు.

మర్నాడు ఉదయం 8 గంటలకల్లా తయారై పోయాము. కానీ అక్క చెల్లెల్లు అఖిల, గాయత్రిలు కొంత ఆలస్యం చేశారు. మేము యాత్రలో వాళ్ళిద్దరినీ మహాలక్ష్ములు అని పిలిచేవాళ్లం. క్షమించండి మావల్ల ఆలస్యమైంది అంటూ వాళ్ళు గుంపులో చేరారు. ఆరోజు మా జీవితాలపై ఎంత ప్రగాఢమైన ముద్ర పడనున్నదో బహుశా 'రాజు, భాను'లకి తప్ప ఇంకెవరికీ తెలిసి వుండదు. ఆ విషయం చెప్పేముందు ఇటుకల సంగతి చెప్తా. ముందుగా ఇటుకలు తయారు చేసే

**అంతరించిపోతున్న జీవరాసులను ముందు తరం వాళ్ళు చూడాలని మీరు కోరుకుంటున్నారా?**



బట్టీలను చూశాం. మాలో చాలామంది చూసి వుండరు. కొందరు వినే ఉండరు. కానీ అక్కడ మేము వెళ్ళి చూసి, కొన్ని ఇటుకలు సొంతంగా మా చేతులతో తయారు చేశాము. ఎంతో సరదా అనిపించింది. ముడిసరుకు తీసుకు రావటం, తడపటం, కలపటం (తొక్కడం), ఇటుకలు చేయటం, ఆపైన ప్రతి ఇటుకపై పేరు ముద్రించటం, అన్నీ చూశాం, చేశాం.

అక్కడినుండి బయలుదేరి బ్రిగేడియర్ గారు స్ఫూర్తిదాయకంగా ఇన్నోవేటర్ల జీవిత చరిత్రలు చెపుతూ వుంటే మైమరచిపోయి వింటూ ముందుకు సాగాము. ఆయన చెప్పే పద్ధతి అలా వుంటుంది మరి. వింటున్నకొద్దీ సాధారణ గ్రామస్తులు అనుకునేవాళ్ళు పెద్ద హీరోలుగా కనిపించసాగారు మాకు. ముందుకు సాగి, 'గొల్లపాలెం' లో పిల్లల ఆశ్రమానికి చేరుకున్నాము. అక్కడి చిన్నపిల్లల స్వాగతం చూస్తే మాకెవ్వరికీ కళ్లలో నీళ్ళు ఆగలేదు.

రైల్వేలో పనిచేసే శరత్ సార్ ఈ ఆశ్రమాన్ని ప్రారంభించి నడిపిస్తున్నారు. ఎన్నో కష్టాలకోర్చి, స్వంతంగా ఖర్చుపెట్టి నడిపిస్తున్నారీ ఆశ్రమాన్ని. ఈ ఆశ్రమంలో కొన్ని భవనాలు వాళ్ళే కట్టుకున్నారు. వాళ్ళకు కావలసిన కూరగాయలు వాళ్ళే పండించుకుంటూ చదువులూ కొనసాగిస్తున్నారు. ఈ పిల్లలంతా ఎవరూ అని అడిగితే రైల్వే ప్లాట్‌ఫారాలమీద దిక్కు మొక్క లేక తిరిగే పిల్లలు... వీళ్ళని అనాథలు అనను. ఎందుకంటే వాళ్ళు దేవుని పిల్లలు. వీళ్ళను చేరదీసి, వారి జీవితానికొక లక్ష్యం కల్పించి, దానిని సాధించటం కొరకు వారిని సంసిద్ధులను చేయటానికి మాత్రమే నేను ప్రత్నిస్తున్నాను... అని చెప్పారా పెద్దమనిషి. ఆయన చెప్పిన మాటలు ఇంకా నాకు గుర్తున్నాయి. .

❀ ప్రతి మనిషికి పుట్టిన తేదీతో పాటు, చనిపోయే తేదీ కూడా నిర్ధారణ అయి వుంటుంది. ఈ రెండు తేదీల మధ్య మనం ఏం చేస్తాము అన్నది మనల్ని గొప్పవాళ్ళుగానో పనికిమాలిన వాళ్ళుగానో చేస్తుంది.

❀ ప్లాట్‌ఫారంపైన పిల్లలు (తప్పిపోయిన, వదిలివేసిన...) సీతాకోక చిలుకల్లా వుంటారు. క్రమంగా వాళ్ళ రంగు బట్టలు పోతాయి. చిరిగిన మురికి గుడ్డలు మిగుల్తాయి. తిండి కోసం కొట్లాడుకునే స్థితి వస్తుంది. మాదక ద్రవ్యాలకు అలవాటు పడతారు, సంఘ వ్యతిరేక పనులు చేస్తారు, పోలీసుల చేతుల్లో పడతారు, జైళ్ళపాలవుతారు. వీరిలో ప్రతికార భావం మొదలవుతుంది. సంఘ వ్యతిరేకులుగా తయారు అవుతారు. ఇంకా అధోగతికి దిగజారుతారు. దీనిని ఆపటం మనందరి కర్తవ్యం. వీళ్ళని మళ్ళీ సీతాకోకల్లా చేయాల్సిన ధర్మం మనందరిదీ.

❀ వీళ్ళను మార్చాలనుకోవటం అవివేకం. మారటానికి తగ్గ వాతావరణం కల్పిస్తే వాళ్ళే మారుతారు.

❀ వీళ్లకి చేపల పులుసు పెట్టడం కాదు. చేపలు పట్టడం నేర్పించాలి.

❀ ఈ ఆశ్రమంలో మూడు గదులు మినహా తతిమావన్నీ వాళ్ళే కట్టుకొన్నారు.

❀ నేను కేవలం సూత్రధారుడ్ని మాత్రమే.

❀ ఇక్కడ మాకు అన్ని మతాలు సమానమే. అందుకే పిల్లలకి క్రిస్మస్‌కి, సంక్రాంతికి, రంజాన్‌కి కొత్త బట్టలు ఇస్తాం.

❀ ఆర్మీలో జీవితంలా వుంటుందిక్కడ పద్ధతి. భారత్ స్కౌట్స్, ఉమ్మడి కుటుంబం, గురుకుల పద్ధతి... అన్నీ వుంటాయిక్కడ

❀ ఏవిధమైన పబ్లిసిటీ లేకుండా పిల్లల్ని ఇక్కడికి తీసుకు వస్తాం.

❀ ఇక్కడి ఆలోచన "దేశంకోసం బ్రతకాలి, దేశంకోసం మరణించాలి, దేశానికే సేవ చేయాలి".

❀ ఇక్కడినుంచి బయటికి వెళ్ళిన 42 మందిలో కొందరు ఇంజనీర్లుగా, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా, సైంటిస్టులుగా, టైలర్లుగా, జెసిబి డ్రైవర్లుగా, వంటవాళ్ళుగా వాళ్ళ ఇష్టాన్ని బట్టి స్థిరపడిపోయారు.

❀ మనం మంచిపనులు చేస్తే సమాజం కూడా మన వెనుకే వస్తుంది.

❀ సినిమాలు, టీవీ సీరియల్లు చూసి, ఊహా ప్రపంచంలో విహరించకండి.

ప్రశాంతమైన వాతావరణంలో దేవుని పిల్లల మధ్య దేవుడిలాంటి శరత్‌గారు... ప్రపంచంలో ఇలాంటి చోటు వుంటుందా?... ఉంది. మేం చూశాం. ఒక పిల్లవాడు ఒక సబ్జక్టులో బాగా చదువుతూ వుంటే పై తరగతికి ప్రమోట్ చేస్తారు శరత్‌గారు పిల్లలు తమకి ఏది కావాలంటే అదే చదువుకోవచ్చు. శరత్‌గారు చేస్తున్న ఈ సామాజిక ప్రయోగం చాలా గొప్పది. కొత్త భారతావనినే సృష్టిస్తున్న ఆయనకి జోహార్లు.

శోధయాత్ర ముగిసిందనే బాధతో మంచి విషయాలు తెలుసుకుందామనే తృప్తితో భూతల స్వర్గం లాంటి ఆశ్రమాన్ని చూశామనే ఆనందంతో..... ఏదో చేయాలనే తపన, స్ఫూర్తితో నిండిపోయాయి మా మనసులు. ఎప్పటికీ కలిసి వుండాలని నిర్ణయిస్తూ విడిపోయాం.

ఇక్కడ నా తోటి యాత్రీకుల గురించి ఒకొక్క మాట చెప్పకపోతే నా జ్ఞాపకాలు పూర్తి కావనిపించింది. ఎవరితో మొదలెట్టాలీ.... సరే ముందు......

**1. యశ్వంత్ అన్న :** ఖర్చులకి వెనుకాడకుండా అందరికీ, అన్ని సదుపాయాలు చేశావు. నువ్వు వుండటం వలన తిండి గురించి మర్చిపోయి, యాత్రను పూర్తిగా వాడుకున్నాం. కొత్త మనుషులమై బయటికి వచ్చాం. ధన్యవాదాలు.



**2. శైలేంద్ర అన్న :** నీ పేరున రెండు పేటెంట్లు ఉన్నాయని, మూడు రోజులు నీతో గడిపినా నాకే తెలియదు. ఇంత సాధారణంగా ఎలా వుండగలవన్నా? నేనైతేనా .... మార్కెటింగ్ గురించి చాలా విషయాలు చెప్పావు.



**3. నరేష్ భయ్యా :** నువ్వు సూపర్ అన్నా. నువ్వే నా మెగాస్టార్. ఎన్ని విషయాలు చెప్పావు? వాతావరణం గురించి నువ్వు చెప్పిందంతా చేస్తే ఈ ప్రపంచమే మారిపోతుంది. థ్యాంక్స్.



**4/5. సాయి, ప్రవీణ్ (యం.ఆర్.ఐ.యం.) :** మొత్తం గుంపులో మీ అంత నవ్వించినవాళ్ళు లేరు. బరువైన సందర్భాల్లో మీ మాటలు మా మనసుల్ని చాలా తేలిక చేశాయి. ఇది చాలా చిన్న ప్రపంచం బ్రదర్స్. ఏ సందులోనో మళ్ళీ కలుద్దాం.



**6. చైతన్య :** గుంపులో నేను కలిసిన రెండో వ్యక్తివి నువ్వే. మనమిద్దరం చాలా మాట్లాడుకున్నాం. ఎం.పి.ల నిధుల గురించి చాలా వివరంగా చెప్పావు. నిన్ను కలవడం చాలా ఆనందంగా వుంది మిత్రమా.



**7. రాజు అన్న :** నువ్వు చేసిన సేవ మరువలేనిదన్నా. అలసిపోయి, టీ తాగాలి అనుకునేటప్పుడల్లా నీవ్వు టీ తో ప్రత్యక్షమయ్యేవాడివి. ఇక నీ ఇన్నోవేషన్ల గురించి మాట్లాడే అర్హత నాకు లేదు. ఒకటి మాత్రం చెప్పగలను. నీలాగనే గొప్పగా వుండి వుంటాయి. నీకు చెప్పినట్లుగానే ఆటోమేటిక్ వీధిలైట్లు పెట్టించే ఏర్పాటు చేస్తాను. మిమ్మల్ని తప్పకుండా మళ్ళీ మళ్ళీ కలుస్తాను సరేనా...



**8. క్రాంతి అన్న :** మీరు బ్రిగేడియర్ సార్ తర్వాత చిన్న బ్రిగేడియరనే చెప్పాలి. వెనకుండి అందరినీ ముందుకు నడిపించేది మీరు. అందరూ మీ చుట్టూ వుండటం వలన మిమ్మల్ని ఎక్కువగా కలువలేక పోయాను. సారీ.



**9. మాధవి అక్క :** అక్కా, మీరొక రైతు, సంఘ సంస్కర్త. మీరే మాకు స్ఫూర్తి. మీరు చేసే పనులు చూడటానికి, నేర్చుకోవటానికి నేనే స్వయంగా మీ ఊరొస్తాను, సరేనా.



**10. మేధా మేడం :** మేడం భవిష్యత్తులో నేను ప్రారంభించబోయే స్వయం ఉపాధి ప్రణాళికకి మీరు చాలా ప్రోత్సాహ



మిచ్చారు. ఆర్కిటెక్చర్‌పై మీరు ఇచ్చిన సలహాలు అమోఘం. శోధయాత్రలలో మీకున్న అనుభవం మాకు పల్లెల్లో చాలా పనికి వచ్చింది. మీరు మధ్యమధ్యలో పెట్టే అల్పాహారం అద్భుతం. అంతకన్నా అద్భుతం మీ పాటలు.



**11. గీత :** మన గుంపులో చాలామంది వద్దనుండి చాలా నేర్చుకున్నాను. నేనే ఎవరికీ ఏమీ ఇవ్వలేక పోయాననిపించేది. మనం మన ఉద్యోగాల గురించి చాలా చర్చించాం. వెబ్ బ్రౌజర్‌లోని కొన్ని ఎడ్వర్‌టైజ్‌మెంట్‌ల గురించి సందేహాలు ఉండేవి. మీతో మాట్లాడిన తర్వాత అవి తీరిపోయాయి. థ్యాంక్స్.

**12/13. అఖిల, గాయత్రి (భవాన్స్ కాలేజ్ ఆఫ్ లైఫ్ సైన్సెస్) :** మిమ్మల్ని యాత్రలో అందరం మహాలక్ష్ములని పిలిచేవాళ్ళం. మీ అక్కా చెల్లెళ్ళకి కోపం రాలేదు కదా. నేను త్వరలో ర్యాబిక్‌క్యూబ్ సాధించడానికి ప్రయత్నం చేస్తా. మీ ఇద్దరి



అల్లరివల్ల యాత్ర సరదాగా గడిచింది...... ముఖ్యంగా గాయత్రి అచ్చమైన తెలుగు అమ్మాయి. 'పూరిణి' గ్రామంలో భోజనం తర్వాత మనం తిన్న ప్రదేశం శుభ్రం చేయటం...... మీవల్లనే సాధ్యపడింది. ఆ చిన్న పనిలో నేనెంతో నేర్చుకొన్నా. ధన్యవాదాలు.

**14/15. మణికంఠ, గీతాసాయికృష్ణ:** సారీ, మిమ్మల్ని యాత్రలో కలిసినా, ఎక్కువగా మాట్లాడ లేక పోయాను. ఈసారి కలిసిన ప్పుడు పాతవి, కొత్తవి కలిపి అన్ని మాట్లాడేసు కుందాం, ఓకే.



**16. నవీర్ రాజా :** మీరు అనుకున్నట్లుగా మీరు తప్పకుండా ఐఎఎస్ అవ్వాలని కోరుకుంటున్నాను. ఈ చక్కని యాత్రలో మీలాంటి వాళ్లతో కలిసినందుకు గర్వంగా, సంతోషంగా ఉంది.



**17. శ్వేత :** మీరు చాలా ధైర్యస్తులు. మీ క్లాస్‌మేట్ మరణించినా మాతో యాత్ర కొనసాగించారు. మీలోని శక్తికి వందనాలు. మా అందరితో పాటు సమానంగా నడిచారు. నీ మాటలు మా అందరికీ హాస్యాన్ని పంచేవి. చాలా ఆనందంగా గడిచింది. సంతోషం.



**18. పృథ్వి :** యాత్రలో మనమెక్కువగా మాట్లాడుకోక పోయినా, చివరి రోజున చాలా మాట్లాడేసుకున్నాం. మన ఉద్యోగాల గురించి చర్చించాం. నీతో మాట్లాడిన తర్వాతే నాకు తెలిసి వచ్చింది. మనుషులు, సంబంధాలు ముఖ్యం, సుఖాలు కాదు. అంతే కదా....!



**19. సుష్మిత (ఎన్.ఐ.టి., వరంగల్) :** మనం చాలా మాట్లాడుకున్నాం. కాళ్ళకి పుండ్లు పడినా నడిచారు మీరు. మీ దీక్ష, పట్టుదల మెచ్చుకోవాలి....... మళ్ళీ యాత్రలో కాకపోయినా ఆ మళ్ళీ యాత్రలోనైనా కలిసి మన జ్ఞాపకాలని పంచుకుందాం. సరేనా.



**20. బ్రిగేడియర్ గారు :** ఏం చెప్పను? మీ ఆత్మ ప్రబోధాన్ని వినండి అని చెప్పారు. అదే చేయాలని నిర్ణయించుకున్నాను. మీరో నడిచే గ్రంథాలయం అనటం సబబు అనిపిస్తోంది. మీతో ఎంత సమయం గడిపినా తక్కువే అనిపిస్తోంది. మీరు మమ్మల్ని ఈ శోధయాత్రలో ఏం నేర్చుకున్నారు అని అడగకండి...... నేర్చుకున్నదంతా చేసి చూపిద్దాం అనుకున్నా. అదేకదా మీరు మాకు నేర్పింది..... ఏం సార్? మీలోని ఓపికకి నేను పాదాభివందనం చేస్తున్నాను.



**21. చివరిగా భాను :** ఒరేయ్ భాను. నీ మూలకంగా కేవలం నీ మూలకంగా నేనింత మంచి కార్యక్రమంలో పాల్గొనగలిగాను. దీనంతటికీ నువ్వే కారణంరా.



**చిన్నశోధయాత్రికుల మనోభావాలు ఎంతో విజ్ఞానవంతంగా ఉన్నాయి. భవిష్యత్తులో జరగనున్న చిన్నశోధయాత్రల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని పల్లెజ్ఞానాన్ని అర్థం చేసుకుని, పల్లె జీవితాన్ని అనుభవించడానికి ముందుకు వస్తారని ఆశిస్తున్నాం.**

**- ఎడిటర్.** ●

# జ్ఞానంతో పల్లెలను జోడించే 'జ్ఞానయజ్ఞం'

పల్లెజనుల ఇన్నోవేషన్ల సేవలో పల్లెసృజన ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో ఎన్నో ఇన్నోవేషన్లు, ఆరోగ్యం, పశు వైద్యం, జీవనోపాధిలకు సంబంధించిన ఎన్నో మంచి పద్ధతులు సేకరించి ప్రచురించాం.

రెండు తెలుగు రాష్ట్రాలలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ పల్లెజ్ఞానం గురించి తెలుసుకొని, ఆలోచించి స్వయంగా ప్రయోగాలు చేసి తోటివారితో పంచుకోవాలన్నదే మా ధ్యేయం. పల్లెనుంచి పల్లెకి, మనిషినుంచి మనిషికి, ప్రాంతం నుండి ప్రాంతానికి ఈ జ్ఞానం చేరటమే మాకు కావలసింది. ఇంత జ్ఞానాన్ని అందిస్తున్న 'పల్లెసృజన' పత్రిక తెలుగు ప్రజలందరికీ చేరితే దాని ప్రభావం ఎంత మహత్తరంగా వుంటుందో ఊహించుకోండి.

దీనికై 'జ్ఞానయజ్ఞం' కార్యక్రమానికి 'పల్లెసృజన' నాంది పలికింది. మారుమూల గ్రామాలతో సహా తెలుగు రాష్ట్రాలలోని మొత్తం 23 జిల్లాలోని గ్రామాలకు 'పల్లెసృజన' పత్రికను అందజేయటమే ఈ 'జ్ఞానయజ్ఞం' సంకల్పం. గ్రామీణ వికాసానికి పల్లెసృజన ఒక వేదికగా మారటంలో ఇది ముఖ్య భూమిక పోషిస్తోందని మా విశ్వాసం. ఈ బృహత్తర కార్యక్రమంలో ఇంతవరకు మాకు చేయూతనిచ్చినవారు .....

| | | | |
|---|---|---|---|
| 1. | డా. చదలవాడ నాగేశ్వరరావు & డా. సుధ దంపతులు | 972 గ్రామాలు | కృష్ణా జిల్లా. (పూర్తి జిల్లా) |
| 2. | చింతకింది మల్లేశం, ఇన్నోవేటర్, | 125 గ్రామాలు | నల్గొండ జిల్లా. |
| 3. | ఆర్. శ్రీనివాస్, | 46 గ్రామాలు | విజయనగరం జిల్లా. |
| 4. | గ్రంధి నాగేంద్ర ప్రసాద్ (అమెరికా) | 100&50 గ్రామాలు | గుంటూరు & రంగారెడ్డి జిల్లాలు. |
| 5. | పి.సి.కె. శర్మ | 10 గ్రామాలు | నిజామాబాద్ జిల్లా. |
| 6. | యం. సత్యనారాయణ | 52 గ్రామాలు | పశ్చిమ గోదావరి జిల్లా. |
| 7. | మహిపాల్ చారి, ఇన్నోవేటర్ | 10 గ్రామాలు | వరంగల్ జిల్లా. |
| 8. | బొమ్మగాని మల్లేష్, ఇన్నోవేటర్ | 10 గ్రామాలు | నల్గొండ జిల్లా. |
| 9. | సి. విజయకుమార్ రెడ్డి | 16 గ్రామాలు | ఆదిలాబాద్ జిల్లా. |
| 10. | అంకుర్ పోగుల ( ఆస్ట్రేలియా) | 15&15 గ్రామాలు | ఆదిలాబాద్ & మెదక్ జిల్లాలు. |
| 11. | యం. రవీంద్ర కుమార్ (గినియా) | 50 గ్రామాలు | మెదక్ జిల్లా. |
| 12. | గీతాసాయి క్రిష్ణ | 10 గ్రామాలు | మహబూబ్‌నగర్ జిల్లా. |
| 13. | బూరుగుపల్లి కృష్ణ (అమెరికా) | 25 గ్రామాలు | శ్రీకాకుళం జిల్లా . |

దాదాపు జిల్లాకు వెయ్యి గ్రామాల ప్రకారం, సంవత్సరానికి ఒక గ్రామానికి రూ. 200/–లసభ్యత్వంతో ఒక జిల్లాకు 2 లక్షల రూపాయలు అవసరమౌతాయి. ఈవిధంగా మిగిలిన 22 జిల్లాలోని అన్ని గ్రామాలకు డిసెంబర్ 2015 నాటికి 'పల్లెసృజన' చేరాలని మా ఆశయం. ఈ 'జ్ఞానయజ్ఞం' లో మీ పూర్తి సహకారాన్ని కోరుతున్నాం. **ఇది సాధ్యం చేయడానికి కొన్ని సూచనలు :**

1. ప్రతి జిల్లానుంచి 40 మంది ఎన్.ఆర్.ఐ.లను లేదా జిల్లా బయట నివసిస్తున్న వారినుండి 5 వేల రూపాయలు సేకరించ గలిగితే ఆ జిల్లాకు కావలసిన 2 లక్షల రూపాయలు సమకూరుతాయి.
2. ఒక జిల్లాలో 200 మంది విద్యార్థులను ప్రేరేపించి వారి తల్లిదండ్రులనుండి రూ. 1000/– చొప్పున సేకరిస్తే ఒక జిల్లాకు కావలసిన సభ్యత్వం సమకూరుతుంది.
3. మీ మిత్రులు, సహ ఉద్యోగులు 200 మందిని ఒకొక్కక్కరు 5 గ్రామాలకు సభ్యత్వం అందించమని అడిగినా ఒక జిల్లాకు సరిపోతుంది.
4. ప్రభుత్వరంగ సంస్థలు, వ్యాపారవేత్తలు వారివారి జిల్లాలలోని గ్రామాలకు సహాయం చేయవచ్చు. జిల్లాలోని పెద్ద పారిశ్రామికవేత్తలు ఆ జిల్లా మొత్తానికి సభ్యత్వం అందించవచ్చు.
5. ప్రతి జిల్లాలో పలుకుబడి కలిగిన పెద్దలు, నాయకులు, సామాజిక స్పృహ వున్నవారు వారివారి జిల్లాలకు సంవత్సరానికి 2 లక్షల రూపాయలు సహాయం చేయవచ్చు.
6. ఇంకేమార్గమైనా అవలంభించవచ్చు.

విరాళం అందించేవారు గ్రామాల పేర్లు, మండలాలు, లేదా జిల్లా/లు పేర్కొనవచ్చు. లేదా ప్రభుత్వ/ పోస్టల్/ అధికారి/ జిల్లా వెబ్‌సైట్ల నుండి మేమే ఆ వివరాలను సేకరిస్తాము. మనమంతా తలుచుకుంటే ఇది అసాధ్యమైన కార్యక్రమమేమీ కాదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని సామాజిక స్పృహగల వ్యక్తులు ఈ జ్ఞానయజ్ఞంలో పాలు పంచుకుంటారని మనసారా ఆశిస్తున్నాము.

**చందా వివరాలకు చివరి పేజి చూడండి.**

**– ఎడిటర్**

# స్పందన

శశిమోహన్ గారికి,

నమస్కారములు. నాపేరు 'సూర్యదేవర రామ్మోహన రావు'. నేను ఒక నవలా రచయితను. నేను ఈమధ్యనే పల్లెసృజన పత్రికలను కొన్నింటిని మీ సంపాదకవర్గ సభ్యుడు, నా చిరకాల మిత్రుడు అయిన వీరరాఘవ రెడ్డి గారివద్ద నుండి సేకరించి చదవడం జరిగింది. మన రాష్ట్రం నుండి ఇంత విశ్లేషణాత్మకమైన, అద్భుతమైన పత్రిక ఒకటి వస్తున్నదా అని ఒక రచయితగా నేనే ఆశ్చర్యపోయాను. మా మిత్రుడు వీరరాఘవరెడ్డి ఇంత మంచి పత్రికకు పనిచేస్తున్నందుకు నాకెంతో ఆనందం కలిగింది. అతన్ని చాలాకాలం తర్వాత ఈమధ్యనే కలవడం జరిగింది. ఇన్నిరోజులు అతన్ని కలవనందుకు నాకే బాధగా తోచింది. నేను చదివిన వాటిలో 'అద్భుతవైద్యుడు అబ్దుల్ కరీం' వ్యాసం నన్నెంతగానో ఆకట్టుకున్నది. ఇలాంటి వైద్యులను గురించి ఇంకా ఎంతో వ్రాయవచ్చు. కానీ, పత్రిక స్థలాభావం వల్ల ఇంతకన్నా ఎక్కువ వ్రాయలేక పోయామని రాఘవరెడ్డి అన్నప్పుడు మీ పరిస్థితి అర్థం చేసుకున్నాను. గ్రామాల్లో ఇలాంటి శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, అమోఘమైన తెలివితేటలతో మరుగున పడిపోతున్నారని తెలిసి నేనే ఆశ్చర్యపోయాను. ఇటువంటి వారిని మీరు ప్రోత్సహించి అట్టడుగు స్థాయి వ్యక్తులను దేశంలోనే అత్యున్నత స్థాయి వ్యక్తి అయిన రాష్ట్రపతి వరకు చేరుస్తున్న మీ కృషి వర్ణణాతీతం అని తెలియజేయుటకు నేనెంతో సంతోషిస్తున్నాను. అతి త్వరలోనే మీ సంపాదక వర్గ సభ్యులందరినీ తప్పక కలుస్తాను.

– **సూర్యదేవర రామ్మోహన రావు,** ప్రసిద్ధ నవలా రచయిత, (వరల్డ్ రికార్డ్), హైదరాబాద్.

రామ్మోహన్ రావు గారికి,

మీ అభిమానానికి ధన్యవాదములు. మీ అభినందనలు మనసారా స్వీకరిస్తున్నాము. మేము వ్రాస్తున్న వ్యాసాలు సరియైన రీతిలోనే పాఠకులకు చేరుతున్నాయన్న ధైర్యాన్ని మాకందించారు. మీరు తప్పక ఒకసారి మా కార్యాలయానికి విచ్చేస్తే మాకెంతో ఆనందంగా వుంటుంది. మీ రాకకై ఎదురు చూస్తూ...... – **జె. శశిమోహన్,** ఎడిటర్.

వీర రాఘవ రెడ్డి గారికి,

నేను 'పల్లెసృజన' పత్రికను, మీరు చేస్తున్న సమాజ సేవను గురించి తెలుసుకొని కొద్దిరోజుల క్రితం మీ కార్యాలయానికి వచ్చాను. అక్కడ బ్రిగేడియర్ గణేశం గారు, కార్యాలయ సిబ్బంది వజ్ర చూపించిన ప్రమాభిమానాలు ఎప్పటికీ మరువలేను. మీరు చేస్తున్న కార్యక్రమాలు నాకెంతో ముచ్చట గొలిపాయి. ఇతరులను గురించే కాదు, పక్కింటి వాళ్ళను గురించి కూడా పట్టించుకునే రోజులు కరువౌతున్న ప్రస్తుత సమాజంలో మీరు సమాజం కొరకు చేస్తున్న సేవలు, ముఖ్యం గ్రామీణ ఇన్నోవేటర్లను రాష్ట్రపతి భవనం దాకా నడిపిస్తున్న మీ కార్యదీక్షను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. మీ కార్యాలయానికి వచ్చినప్పుడే నేను కూడా నావంతుగా పల్లెసృజనకు ఏదైనా సహకారం అందించాలని నిర్ణయించుకుని 'పల్లెసృజన' పత్రిక వీలైనంత మందికి అందేలా చందాదారులను తయారు చేసి ఇవ్వాలనుకున్నాను. కానీ దురదృష్ట వశాత్తు నాకు గుండె ఆపరేషన్ జరగటం వల్ల ఈ కార్యానికి కొంత అంతరాయం కలిగింది. నేను ఆపరేషన్ చేయించుకున్నపుడు ఆస్పత్రిలో వుండి కూడా పల్లెసృజనకు ఏదైనా తప్పకుండా చేయాలని నిర్ణయించుకున్నాను. నేడు ఆస్పత్రి నుండి మా ఊరికి బయలుదేరి వెళుతున్నాను. వెళ్ళిన వెంటనే కార్యరంగంలో దిగి, వీలైనన్ని పల్లెసృజన పత్రికలు ప్రజల్లోకి వెళ్ళేలా నావంతు కృషి చేస్తానని తెలియజేయుటకు సంతోషిస్తున్నాను. మీరు మీ కార్యక్రమాలు ఇంకా అభివృద్ధి చెందాలని, మీరు వెతికి, వెలికి తీసిన సృజనలు ఉభయ రాష్ట్రాల ప్రజలు విస్తారంగా వినియోగించుకోవాలని, ఇంకా ఎంతోమంది ఇన్నోవేటర్లకు మీరు వెలుగును ప్రసాదిస్తారని ఆశిస్తూ మీకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

– ఎల్. విజయ కుమార్, ఖమ్మం. Ph.: 9291658584...

విజయ కుమార్ గారికి నమస్కారములు,

మీలాంటి అభిమానుల అండదండలతో మేమింగా ఉత్సాహంగా ముందుకు సాగుతామనే విశ్వాసంతో ఉన్నాము. పల్లెసృజన కార్యాలయానికి వచ్చి, మా కార్యక్రమాల పట్ల మీ అభినందనలు మాకెంతో ఆనందదాయకం. మీ ఆరోగ్యం క్షేమంగా లేకపోయినా మా 'జ్ఞానయజ్ఞం'లో పాలు పంచుకోవాలన్న మీ కుతూహలాన్ని మేము అభినందించకుండా ఉండలేక పోతున్నాం. మీ ఆరోగ్యం త్వరగా కుదుటపడి జ్ఞాన యజ్ఞంలో విరివిగా పాల్గొని ఎంతోమంది గ్రామీణులకు 'పల్లెజ్ఞానం' చేరవేసే యజ్ఞంలో మీ పాత్ర ఎంతో పెరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, మీరు పంపే చందాదారుల చిరునామాలకై ఎదురు చూస్తూంటాము. 'పల్లెసృజన' అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు కూడా మీరు త్వరగా కోలుకోవాలని మీకు శుభాకాంక్షలు తెలియజేయమన్నారు.

– **పల్లె వీర రాఘవ రెడ్డి,** సబ్ ఎడిటర్, పల్లెసృజన



వరిగడ్డితో నేసిన కండువాను రాష్ట్రపతికి బహూకరిస్తున్న రైతు ఇన్నోవేటర్ ముప్పా కృష్ణమూర్తి




చెరువుల శుభ్రతలో నిష్ణాతుడు గోదాసు నర్సింహతో చర్చిస్తున్న కేంద్రమంత్రి శ్రీ వెంకయ్య నాయుడు.


PALLESRUJANA Telugu Bi-monthly 20/-    March-April 2015    RNI No. APTEL 12136/01/01/2011-TC


# పల్లెసృజన


## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే








### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెస్పృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెస్పృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,

సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866001678

E-mail : anchor@pallesrujana.org   Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904